# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది:

## ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారన్న సబిత
- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుందని వ్యాఖ్య
- తోపులాటలో జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని ఆవేదన




**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరోపిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆమె జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌తో పాటు జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో -4 లో

# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

# పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

## అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం




- మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం
- తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- హైదరాబాద్ వెలుపల 9 కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు ప్రాతినిధ్యం
- ప్రజా జీవితంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమన్న ప్రభుత్వం
- బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, సీపీఐ సభ్యులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.



సూరారం కాలనీ ప్రభుత్వ పాఠశాలలో మట్టి వినాయకుల పంపిణీలో రవిందర్ ముదిరాజ్..



ప్లాస్టిక్ నివారణకు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న పర్యావరణ ప్రేమికుడు..

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన.. ప్లాస్టిక్ వినియోగానికి గుడ్‌బై..
- ప్లాస్టిక్ నియంత్రణకు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించిన కోలా రవిందర్ ముదిరాజ్..
- ప్లాస్టిక్‌పై సమరశంఖం.. పర్యావరణ పరిరక్షణకు రవీందర్ అండ..!

# ప్లాస్టిక్ కవర్లకు గుడ్‌బై.. చేతి సంచులకు జై..!

## విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలు, చేతి సంచుల పంపిణీ..

-5 లో

# రూ.2,300 కోట్లతో చెరువుల పరిరక్షణ

### త్వరలో దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారికి కార్డులు

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్ర ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల -4 లో



జి.సృజన ఐఏఎస్.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్..

# 'సిఎంసి' టౌన్‌ప్లానింగ్‌లో.. భారీగా బదిలీలు..

## 'ఏసీపీ'లు, 'టీపీఎస్'లకు బదిలీలు.. పలువురికి అదనపు బాధ్యతలు..

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) టౌన్‌ప్లానింగ్ విభాగంలో పరిపాలనా మార్పులుచోటుచేసుకున్నాయి. వివిధ సర్కిళ్లలో విధులునిర్వహిస్తున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్లు,(ఏసిపి) టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌లు (టిపిఎస్), టౌన్‌ప్లానింగ్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు, అదనపు బాధ్యతలు అప్పగిస్తూ, సిఎంసి కమిషనర్ జి.సృజన, ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.. పరిపాలనా సౌలభ్యం, టౌన్‌ప్లానింగ్ విభాగం సమర్థవంతమైన నిర్వహణ కోసం ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని కమిషనర్ పేర్కొన్నారు.. వివిధ సర్కిళ్ళ అధికారుల బదిలీలు ఇలా ఉన్నాయి.. నార్సింగి సర్కిల్-45 ఏసీపీ ప్రసీధకు శేరిలింగంపల్లి సర్కిల్-49 ఏసీపీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.. దీంతో ఇప్పటివరకు ఆమె నిర్వహిస్తున్న పటాన్‌చెరు సర్కిల్-46అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేశారు..

జీడిమెట్ల-55, కొంపల్లి-56 ఏసీపీ ఐ. రాణిని పటాన్‌చెరు సర్కిల్-46కు బదిలీ చేసి ఏసీపీగానియమించారు. అదనంగా అమీన్‌పూర్ సర్కిల్-47 ఏసీపీ బాధ్యతలు కూడా అప్పగింత.. అమీన్‌పూర్ సర్కిల్-47 టీపీఓ (ఇన్‌చార్జ్ ఏసీపీ) ప్రసాద్‌ను కొంపల్లి సర్కిల్-56 ఇన్‌చార్జ్ ఏసీపీగా బదిలీ చేశారు.. అదే సమయంలో శేరిలింగంపల్లి సర్కిల్-49 ఏసీపీ ఈ.సురేందర్ రెడ్డిని జీడిమెట్ల సర్కిల్-55 ఏసీపీగా బదిలీ చేశారు.. జీడిమెట్ల-55, కొంపల్లి-56 టీపీఎస్ బి.మచ్చేందర్‌ను మాదాపూర్ సర్కిల్-50 టీపీఎస్‌గా బదిలీ చేసి, అదనంగా ఆల్విన్ కాలనీ సర్కిల్-51 టీపీఎస్ బాధ్యతలు అప్పగించారు.మేడ్చల్ సర్కిల్-60 డీఎం గ్రేడ్-III జి.సాయి తేజను నిజాంపేట్ సర్కిల్-58కు బదిలీ చేసి, అదనంగా దుండిగల్ సర్కిల్-59 డీఎం గ్రేడ్-III బాధ్యతలు అప్పగించారు.. చింతల్ సర్కిల్-54 టీపీఎస్ పి.మధుకు తన ప్రస్తుత విధులతో పాటు జీడిమెట్ల సర్కిల్-55 టీపీఎస్అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే గాజులరామారం సర్కిల్-57 టీపీఎస్ బి.సరితా సేన్‌కు కొంపల్లి సర్కిల్-56 టీపీఎస్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారు.. నిజాంపేట్ సర్కిల్-58 టీపీఎస్ ఎస్.ముఖేష్ సింగ్‌ను మేడ్చల్ సర్కిల్-60 టీపీఎస్‌గా బదిలీ చేశారు.నార్సింగి సర్కిల్-45, పటాన్‌చెరు సర్కిల్-46 టీపీఎస్ పి.రమేష్‌కు అమీన్‌పూర్ సర్కిల్-47 టీపీఎస్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ బాధ్యతలు రోహన్ ఠాకూర్, టీపీఓ, వైద్య సెలవుల నుంచి తిరిగి విధుల్లో చేరే వరకు కొనసాగనున్నాయి..

**తక్షణమే బాధ్యతలు స్వీకరణ..!**

ఈ ఉత్తర్వుల ప్రకారం సంబంధిత అధికారులు తమకు కేటాయించిన పోస్టుల్లో తక్షణమే బాధ్యతలు స్వీకరించి, చీఫ్ సిటీ ప్లానర్ ద్వారా సిఎంసి కమిషనర్‌కు చార్జ్ స్వీకరణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. తాజా బదిలీలు, అదనపు బాధ్యతలతో సైబరాబాద్ పరిధిలోని పలు టౌన్‌ప్లానింగ్ సర్కిళ్లలో అధికారుల విధుల్లో మార్పులు చోటుచేసుకున్నాయి..




# రూ.11 వేల కోట్ల ఫీజు బకాయిలు.. వెంటనే విడుదల చేయాలి..

## విద్యార్థుల సమస్యలపై బషీర్‌బాగ్‌లో బీఆర్ఎస్వీ నిరసన ర్యాలీ..

- గెల్లు శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో ఆందోళన కార్యక్రమం..
- పెండింగ్ ఫీజు బకాయిలపై ప్రభుత్వానికి నిరసన ర్యాలీతో విజ్ఞప్తి..
- విద్యార్థులు నినాదాలు చేస్తూ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్..
- విద్యార్థుల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని వెల్లడి..
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్వీ నాయకుడు కొర్ర ప్రవీణ్ పాల్గొన్నారు..

-4 లో



బషీర్‌బాగ్‌లో ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం విద్యార్థి సంఘం ర్యాలీ..




# రూ.11 వేల కోట్ల ఫీజు బకాయిలు..
# వెంటనే విడుదల చేయాలి..

## విద్యార్థుల సమస్యలపై బషీర్‌బాగ్‌లో బీఆర్ఎస్‌వి నిరసన ర్యాలీ..

- గెల్లు శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో ఆందోళన కార్యక్రమం..
- పెండింగ్ ఫీజు బకాయిలపై ప్రభుత్వానికి నిరసన ర్యాలీతో విజ్ఞప్తి..
- విద్యార్థులు నినాదాలు చేస్తూ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్..
- విద్యార్థుల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని వెల్లడి..
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్‌వి నాయకుడు కొర్ర ప్రవీణ్ పాల్గొన్నారు..




**హైదరాబాద్, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్‌వీ నాయకుడు కొర్ర ప్రవీణ్ నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలోని విద్యార్థులకు సంబంధించిన రూ.11 వేల కోట్ల పెండింగ్ ఫీజు బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది.ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నాయకులు పేర్కొన్నారు.విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర విద్యా బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు..

బషీర్‌బాగ్‌లో నిర్వహించిన నిరసన ర్యాలీలో విద్యార్థులతో కలిసి బీఆర్ఎస్‌వీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఫీజు బకాయిల విషయంలో ఇకపై జాప్యం చేయకూడదని డిమాండ్ చేశారు.. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘం నాయకులు హెచ్చరించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కొర్ర ప్రవీణ్ నాయక్ నిరసన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల డిమాండ్లకు మద్దతు తెలిపారు.. విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్‌వీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు.. కొర్ర ప్రవీణ్ నాయక్..

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది:

## ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు

-3 పేజి తరువాయి

మాట్లాడిన ఆమె, తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలు దేశంలోనే ఎక్కడాలేని విధంగా కౌరవసభను తలపించాయని మండిపడ్డారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉంటుందని, అయితే 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తమను శాసనసభ లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని సబితా ఇంద్రారెడ్డి వాపోయారు. కనీసం మహిళా ప్రజాప్రతినిధులనైనా సభలోకి అనుమతించాలని విన్నవించినా పోలీసులు పట్టించుకోలేదని, మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగడమే కాకుండా, పురుష ఎమ్మెల్యేలను కిందపడేసి తొక్కేశారని ఆరోపించారు. ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ

ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు.వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు. 22ఎ పేరుతో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి భారీ భూదందాకు తెరలేపారని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఈ దాడుల ఘటనలపై సమగ్ర లేఖలు రాస్తున్నామని, కాంగ్రెస్ నాయకత్వం దీనిపై వెంటనే స్పందించి సమాధానం చెప్పాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

# రూ.2,300 కోట్లతో చెరువుల పరిరక్షణ

-3 పేజి తరువాయి

సమయంలో భారాస మండలి పక్ష నేత మధుసూదనాచారి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు మంత్రి బదులిచ్చారు. రాష్ట్రంలో అన్ని చెరువుల పరిరక్షణకు కమిటీ వేసే ప్రక్రియ ప్రారంభించామన్నారు. 44 వేల చెరువులను జియోట్యాగింగ్ చేశామని, ఇప్పటికే ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు రూ.2,300 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ(పీడీఎస్)లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా కన్నా రేషన్‌కార్డులు అధిక సంఖ్యలో ఉన్నాయని, అనర్హుల కార్డులను తొలగించే ప్రయత్నం చేయాలని సభ్యులు దాసోజు శ్రవణ్, భానుప్రసాదరావు కోరారు.


దీనిపై ఉత్తమ్ స్పందిస్తూ.. ఈ విషయం పరిశీలిస్తామని, అయితే అర్హులందరికీ ఉచిత బియ్యం అందాలనే లక్ష్యంతో కార్డుల సంఖ్యను ప్రభుత్వం కాస్త పెంచిందని తెలిపారు. త్వరలో దారిద్ర్యరేఖకు ఎగువన (ఏపీఎల్) ఉన్నవారికి కార్డులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. సభ్యుడు కోటిరెడ్డి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. నెల్లికల్ ఎత్తిపోతల పథకం వచ్చే ఏడాది జూన్ నాటికి మొదటి విడత, డిసెంబరు కల్లా రెండో విడతలో 24 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఇమామ్‌లకు, మౌజమ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం సముచిత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అజారుద్దీన్ తెలిపారు. వారికి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు లేవని పేర్కొన్నారు. ఇంకా వారి సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సభ్యులు అఫెండి, తీన్మార్ మల్లన్న అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిచ్చారు. యాంత్రీకరణ పథకం కింద రైతులకు నాణ్యమైన వ్యవసాయ

యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. రైతులు తమకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, నచ్చిన కంపెనీ నుంచి కొనుగోలు చేసుకునే విధంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు.

శాసనమండలిలో ప్రశ్నోత్తరాలు ముగిశాక.. ప్రత్యేక ప్రస్తావనలకు, పిటిషన్లకు ఛైర్మన్ అవకాశం ఇచ్చారు. ప్రత్యేక ప్రస్తావన(స్పెషల్ మెన్షన్)లో భాగంగా భారాస సభ్యుడు గోరటి వెంకన్న పాలిటెక్నిక్ విద్యను రాష్ట్రంలో ఎందుకు నీరుగారుస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం దీనిపై మండలిలో ఒక పాట కూడా పాడారు.

సభ్యులు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, శంకర్‌నాయక్, అంజిరెడ్డి తదితరులు ప్రశ్నోత్తరాలు, స్పెషల్ మెన్షన్ సమయంలో మాట్లాడారు.


సూరారం కాలనీ ప్రభుత్వ పాఠశాలలో మట్టి వినాయకుల పంపిణీలో రవిందర్ ముదిరాజ్..


ప్లాస్టిక్ నివారణకు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న పర్యావరణ ప్రేమికుడు..

- పర్యావరణ పరిరక్షణపై అవగాహన.. ప్లాస్టిక్ వినియోగానికి గుడ్‌బై..
- ప్లాస్టిక్ నియంత్రణకు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించిన కోలా రవిందర్ ముదిరాజ్..
- ప్లాస్టిక్‌పై సమరశంఖం.. పర్యావరణ పరిరక్షణకు రవీందర్ అండ..!

# ప్లాస్టిక్ కవర్లకు గుడ్‌బై.. చేతి సంచులకు జై..!


## విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలు, చేతి సంచుల పంపిణీ..

- సూరారం జెడ్పీహెచ్ఎస్‌లో పర్యావరణ ప్రేమికుడు రవీందర్ అవగాహన కార్యక్రమం.
- విద్యార్థులకు 200 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ..
- ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయంగా 300 చేతి సంచులు పంపిణీ..
- ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు..
- కూరగాయలు, పండ్లు కొనుగోలుకు చేతి సంచులనే వినియోగించాలని సూచన..
- రవీందర్ ముదిరాజ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు..
- ప్లాస్టిక్ కవర్లు వాడబోమని, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని విద్యార్థుల ప్రతిజ్ఞ..
- అనంతరం ప్లాస్టిక్ వ్యతిరేక నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** పర్యావరణ పరిరక్షణపై చిన్నారుల్లోనే అవగాహన పెంపొందిస్తే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పర్యావరణ ప్రేమికుడు, సామాజిక వేత్త, ప్లాస్టిక్ నియంత్రణ పోరాట యోధుడు కోలా రవిందర్ ముదిరాజ్ పేర్కొన్నారు.. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన, పర్యావరణ ప్రేమికులు, సామాజిక వేత్త, కోల రవీందర్ ముదిరాజ్ విద్యార్థులకు 200 మట్టి వినాయకుని విగ్రహాలు, 300 చేతి సంచులు పంపిణీ చేశారు.. పర్యావరణాన్ని పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించి, వాటికి ప్రత్యామ్నాయంగా చేతి సంచులను ఉపయోగించాలని అవగాహన కల్పించారు.. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలగకుండా విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. పర్యావరణహితమైన వినాయక ప్రతిమల వినియోగం ద్వారా కలిగే లాభాలను వివరించారు..

## ప్లాస్టిక్ నియంత్రణకై విద్యార్థులచే ప్రతిజ్ఞ..

పర్యావరణ పరిరక్షణపై కోలా రవిందర్ ముదిరాజ్ చేయించిన ప్రతిజ్ఞ తూచా తప్పకుండా పాటిస్తామని, పాఠశాల విద్యార్థులు తమ నిబద్ధతను చాటుకున్నారు. ఇకపై ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించబోమని, కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేందుకు చేతి సంచులను తీసుకెళ్లేలా తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విద్యార్థులు స్పష్టం చేశారు.. అనంతరం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలనపై, సూరారం వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, చేతి సంచులను అలవాటు చేసుకోవాలని ప్రజలకు సందేశాన్ని అందించారు.. విద్యార్థుల నినాదాలతో పాఠశాల పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన వాతావరణం నెలకొంది.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శ్రీమతి పుణ్యవతి, మల్లికార్జున్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని వారు సూచించారు.


ప్లాస్టిక్ నియంత్రణ, గోనె సంచుల వాడకంపై రవిందర్ ముదిరాజ్ సందేశం..



# మూడు హ్యామ్ రోడ్డు పనులకు శ్రీకారం

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మూడు హ్యామ్ రోడ్డు పనులకు మంత్రులు సీతక్క, జూపల్లి శంకుస్థాపన చేశారు. పెద్దకొత్తపల్లి, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లో మొత్తం 19.35కిలోమీటర్ల మేర రహదారులను రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. పెద్దకొత్తపల్లి మండలంలో 6.95 కిలోమీటర్లు, పాన్‌గల్‌లో 4.40 కిలోమీటర్లు, వీపనగండ్లలో 8 కిలోమీటర్లరహదారులు నిర్మించనున్నారు. ఈ రహదారులతో గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పెద్దకొత్తపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో రూ.15.87 కోట్ల అంచనావ్యయంతో చేపట్టనున్న మూడు హ్యామ్ రోడ్డు పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు శంకుస్థాపన చేశారు. శనివారం నక్కలపల్లి స్టేజ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.మూడు రహదారిపనుల ద్వారా మొత్తం 19.35 కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, మండల కేంద్రాలు, ప్రధాన రహదారులతో గ్రామాలకుఅనుసంధానం పెంచడం, ప్రజల ప్రయాణ సమయాన్ని తగ్గించడం వంటి లక్ష్యాలతో ఈ పనులను చేపడుతున్నారు. హ్యామ్ విధానంలో చేపట్టే ఈ రహదారి పనులు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకుం వాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. పెద్దకొత్తపల్లి మండలం బండారపాకుల వద్ద పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జెడ్పీ రోడ్డు వరకు నక్కలపల్లి, వెంకటచెర్ల మీదుగా 6.95 కిలోమీటర్ల మేరరహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు సుమారు రూ.5.70 కోట్లు కేటాయించారు. ఈ రహదారి ద్వారా మండలంలోని పలు గ్రామాలకు మెరుగైన రాకపోకలు అందుబాటులోకి రానున్నాయి.పాన్‌గల్ మండలంలో బండపల్లి మీదుగా పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి జమ్మాపూర్ వరకు 4.40 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి సుమారు రూ.3.61 కోట్లు మంజూరు చేశారు. ఈ రహదారి పనులు పూర్తయితేగ్రామీణ ప్రాంతాల నుంచి ప్రధాన రహదారులకు రాకపోకలు సులభతరం కానున్నాయి. వీపనగండ్ల మండలంలో కొర్లకుంట ఎక్స్ రోడ్డు నుంచి తూముకుంట--బొల్లారం ఎక్స్ రోడ్డు వరకు 8 కిలోమీటర్ల మేరరహదారిని నిర్మించనున్నారు. ఈ పనులకు రూ.6.56 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మూడు రోడ్లకు కలిపి రూ.15.87 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారులుఅందుబాటులోకి రావడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్య, వైద్యం, ఉపాధి అవసరాల కోసం ప్రజల ప్రయాణాలు సులభతరం కానున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులుఎదురయ్యే ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి ప్రజలకు కీలకంగా మారనుంది. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు సూచించారు.

# కోకాపేట రియల్ ఎస్టేట్ అంతలో ఎంత మార్పు.. రివర్స్ గేర్...

**హైదరాబాద్, సెప్టెంబర్ 11, పెన్ పవర్:**
కోకాపేట నియోపోలిస్‌లో 4.59 ఎకరాల ప్లాట్‌కు హెచ్ఎండీఏ నిర్వహించిన ఆన్‌లైన్ వేలానికి ఆశించిన స్పందన రాలేదు. కేవలం ఒక్క బిడ్ దాఖలవడంతో ఎకరాకు రూ.120 కోట్ల కనీస ధరకే ప్లాటుఅమ్ముడుపోయింది. గత వేలంలో ఇదే భూమికి ఎకరాకు రూ.136 కోట్లు పలికినా.. బిడ్డర్ గడువులోపు డబ్బు చెల్లించకపోవడంతో మళ్లీ వేలం నిర్వహించారు. మరోవైపు గోల్డెన్ మైల్‌లోని 0.70 ఎకరాల ప్లాటుకు మాత్రం పోటీ పెరిగి ఎకరాకు రూ.115 కోట్ల అత్యధిక బిడ్ నమోదైంది. హైదరాబాద్‌లో అత్యంత విలువైన కోకాపేట భూముల ఆన్‌లైన్ వేలం హెచ్ఎండీఏకు నిరాశను కలిగించింది. ఆశించినస్థాయిలో ఆదాయాన్ని అందించలేకపోయింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట నియోపోలిస్‌లోని సర్వే నంబర్లు 239, 240లో 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్ నంబర్ 17కుబుధవారం నిర్వహించిన వేలంలో కేవలం ఒక్క బిడ్ మాత్రమే దాఖలైంది. దీంతో పోటీ లేకపోవడంతో కనీస ధర అయిన ఎకరాకు రూ.120 కోట్లకే ప్లాటు దక్కింది. ఈ ప్లాటు ద్వారా ప్రభుత్వానికి సుమారురూ.550.8 కోట్ల ఆదాయం సమకూరనుంది. అయితే గతంలో ఇదే ప్లాటుకు నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.136 కోట్ల ధర పలికింది. అత్యధిక ధరకు బిడ్ దాఖలు చేసిన సంస్థ గడువులోగా నిర్ణీతమొత్తాన్ని చెల్లించకపోవడంతో ఆ లావాదేవీ నిలిచిపోయింది. దీంతో హెచ్ఎండీఏ తాజాగా మరోసారి వేలం నిర్వహించింది. ఈసారి పోటీ బిడ్లు లేకపోవడంతో గతంలో నమోదైన ధరతో పోలిస్తే తక్కువ మొత్తానికే భూమి అమ్ముడుపోయింది .కోకాపేటకు సమీపంలోని గోల్డెన్ మైల్ సైట్-1లో 0.70 ఎకరాల భూమికి మాత్రం వేలంలో మంచి స్పందన




లభించింది. సర్వే నంబర్ 109లోని ఈ ప్లాటుకు హెచ్ఎండీఏకనీస ధరను ఎకరాకు రూ.70 కోట్లుగా నిర్ణయించింది. అయితే వేలంలో పోటీ పెరగడంతో అత్యధిక బిడ్ ఎకరాకు రూ.115 కోట్లకు చేరింది. దీంతో ఈ ప్లాటుకు నిర్ణయించిన కనీస ధర కంటే గణనీయంగాఎక్కువ ధరకు అమ్ముడుపోయింది. ఒకే ప్రాంతంలో ఉన్న భూములకు వేలంలో భిన్నమైన స్పందన రావడం ఆసక్తికరంగా మారింది. కోకాపేట నియోపోలిస్‌లోని భారీ ప్లాటుకు ఒక్క బిడ్ మాత్రమే రావడం,గోల్డెన్ మైల్ ప్లాటుకు మాత్రం పోటీ నెలకొనడం మార్కెట్ పరిస్థితులపై చర్చకు దారితీసింది.ఈ రెండు ప్లాట్లు కోకాపేటలో వ్యూహాత్మక ప్రదేశాల్లో ఉన్నాయని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఔటర్ రింగ్‌రోడ్డుతో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ ప్రాంతాలకు వీటికి మెరుగైన రహదారి అనుసంధానం ఉందని చెప్పారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న పశ్చిమ హైదరాబాద్‌లో కోకాపేట కీలక వాణిజ్య, నివాస కేంద్రంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఇక్కడి భూములకు భారీ డిమాండ్ ఉందని అన్నారు. అయితే తాజా వేలంలో నియోపోలిస్ ప్లాటుకు గత వేలంతో పోలిస్తే తక్కువ ధర రావడంహెచ్ఎండీఏను నిరాశ పరిచింది.

# సోదిలో కనిపించని బీజేపీ...

**హైదరాబాద్, సెప్టెంబర్ 11, పెన్ పవర్:**
తెలంగాణలో మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలన్నీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య యుద్ధాన్ని సూచిస్తున్నాయి. బీజేపీ ఎక్కడా కనిపించడం లేదు. పార్లమెంట్ ఎన్నికల నాటికి తెలంగాణలోబీఆర్ఎస్ ఓటు బ్యాంక్ దాదాపు 16–18 శాతానికి పడిపోవడం, కాంగ్రెస్ – బీజేపీ చెరో 8 స్థానాలు గెలుచుకోవడంతో.. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రత్యామ్నాయం తామేనని కమలనాథులు భావించారు.కానీ, గత కొన్ని రోజులుగా అసెంబ్లీ లోపల, బయట చోటుచేసుకున్న హైవోల్టేజ్ పరిణామాలను గమనిస్తే.. తెలంగాణ రాజకీయం మళ్లీ పాత రోజుల్లా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గానే మారిపోయింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న రాజకీయ వ్యూహాలు, బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు, అరెస్టులు, కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దర్యాప్తులు మొత్తం పొలిటికల్ స్పేస్‌ను ఆక్రమించేశాయి. ఈ హోరాహోరీ పోరు మధ్యబీజేపీ తీవ్రంగా వెనుకబడి, రేసులో లేనట్లే కనిపించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది.పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జాతీయ అంశాల ప్రాతిపదికన వచ్చినవి తప్ప, స్థానిక రాజకీయాల్లో బీజేపీబలం పెరిగినట్లు కాదని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో క్షేత్రస్థాయి యంత్రాంగం, నిలకడైన కేడర్ ఇప్పటికీ బీఆర్ఎస్ వద్దే ఉంది. శాసనసభ వేదికగా ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కేటీఆర్,హరీశ్‌రావు నాయకత్వంలోని గులాబీ దళం దూకుడుగా ముందుకెళ్తోంది. అదే సమయంలో, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి కాంగ్రెస్‌తో నేరుగా తలపడుతున్నది కూడా బీఆర్ఎస్ మాత్రమే. దీంతోసహజంగానే మీడియా ఫ్రేమ్‌లో, ప్రజల చర్చల్లో బిఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తోంది.మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలివిగా బీజేపీని రేసులోకి రానివ్వకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.రేవంత్ రెడ్డి టార్గెట్ ఎప్పుడూ కేసీఆర్ మరియు బీఆర్ఎస్ నాయకత్వమే. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలు, శాసనసభలో దళిత స్పీకర్ అవమాన ఉదంతం, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కుట్రలంటూ చర్చఅంతా తమకూ–బీఆర్ఎస్‌కూ మధ్యే పరిమితమయ్యేలా కాంగ్రెస్ నెరేటివ్‌ను సెట్ చేయగలిగింది. కాంగ్రెస్ వ్యూహంలో కేసీఆర్ విలన్‌గా, రేవంత్ నాయకుడిగా కనిపిస్తున్నప్పుడు, మూడో పక్షంగా ఉన్నబీజేపీకి ఎలాంటి పొలిటికల్ స్పేస్ లేదా ప్రాధాన్యత దక్కడం లేదు. ఈ రచ్చ అంతటిలోనూ బీజేపీ సొంతంగా ఒక బలమైన నెరేటివ్‌ను తయారు చేసుకోవడంలో ఘోరంగా విఫలమవుతోంది.ఢిల్లీ నాయకత్వం, లోక్‌సభ విజయాలను మాత్రమే నమ్ముకుంటే స్థానిక రాజకీయాల్లో మనుగడ కష్టమని కమలనాథులు గ్రహించలేకపోతున్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు బీజేపీకి లభించే అవకాశంచాలా పరిమితంగా ఉండటంతో పాటు, వీధుల్లో కాంగ్రెస్‌ను ఢీకొట్టే ఆందోళన కార్యక్రమాలను సృష్టించడంలో



పార్టీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీంతో బీజేపీ ఇచ్చే నిరసన ప్రకటనలు బీఆర్ఎస్–కాంగ్రెస్‌దాడుల ముందు కొట్టుకుపోతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తదుపరి మైలేజ్‌ను నిలబెట్టుకోవడంలో బీజేపీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్‌ను ఢీకొట్టగల ఏకైక శక్త్య బీఆర్ఎస్ మాత్రమే అనే నమ్మకం మళ్లీ బలపడితే, బీజేపీ సాధించిన 8 లోక్‌సభ సీట్ల విజయం ఒక తాత్కాలిక బబుల్‌గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బీజేపీ ఇదే రకమైనసైలెంట్ రోల్ పోషిస్తే.. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్–బీఆర్ఎస్ ద్విముఖ పోరే కంటిన్యూ అవ్వడం ఖాయం.

### బ్యాక్ స్టెప్ లోపం..ఎవరిది

తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ స్లో అండ్ స్టడీ విన్స్ ది రేస్ అన్న రీతిలో ముందుకు వెళుతుంది. ఒకవైపు అధికార కాంగ్రెస్ పై బీఆర్ఎస్ దూకుడుతో వెళుతుంటే బీజేపీ మాత్రం నిదానంగా తమకార్యక్రమాలను చేస్తుంది. తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ స్పీడు ముందు బీజేపీ తేలిపోయిందనే వాదన ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో విస్తృతంగా వినిపిస్తోంది. ముఖ్యంగా 2026 సెప్టెంబర్ నాటితాజా అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో, రాష్ట్ర రాజకీయం అంతా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా మారిపోయింది. అసెంబ్లీ లోపల, వెలుపల బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్నతీవ్రమైన పోరాటాలు, ఆందోళనల వల్ల ప్రధాన ప్రతిపక్షంగా తామే ఉన్నామనే సంకేతాన్ని ఆ పార్టీ బలంగా పంపగలుగుతోంద రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కేటీఆర్, హరీశ్ రావు వంటి నేతలు నల్ల టి-షర్టుల నిరసనలు, ధర్నాలతో మీడియా మరియు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నారు. 20 మందికి పైగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్, ఆ తర్వాతి రాజకీయ హైడ్రామాతో వార్తలన్నీ కాంగ్రెస్–బీఆర్ఎస్ చుట్టూనే తిరుగుతున్నాయి. బీజేపీ సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్, 22ఏ భూముల సమస్యలపై నిరసనలు తెలుపుతున్న ప్పటికీ, బీఆర్ఎస్ స్థాయిలో రాజకీయమైలేజ్ సాధించలేకపోతోందనే విశ్లేషణలు ఉన్నాయి. అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగా ప్రజా సమస్యలను పక్కనబెట్టి రాజకీయ డ్రామాలు ఆడుతున్నాయని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడుఎన్. రాంచందర్ రావు విమర్శిస్తున్నారు గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ క్షీణించి, బీజేపీ పుంజుకున్నప్పటికీ.. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ తనపట్టును నిరూపించుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించే క్రమంలో బీఆర్ఎస్ చూపిస్తున్న దూకుడు ముందు బీజేపీ రేసులో కాస్త వెనుకబడిందనే అభిప్రాయంవ్యక్తమవుతోంది. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మళ్లీ పుంజుకోవడానికి బీజేపీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. అయితే బీజేపీ ఎన్నికల వ్యూహం ముందు రానున్న కాలంలో బీఆర్ఎస్ ఎంత మేరకు నిలబడుతుందన్నది ప్రశ్నార్థకమే అయినప్పటికీ ప్రస్తుతానికి మాత్రం బీఆర్ఎస్ స్పీడ్ ను బీజేపీ అందుకోలేకపోతుందన్నది నిజం.

# కొండా దెబ్బకు రాజ్ గోపల్ రెడ్డి యూ టర్న్..

**హైదరాబాద్, సెప్టెంబర్ 11, పెన్ పవర్:**
తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరచుగా మీడియాలో ఉంటున్నారు. తనకు మంత్రి పదవి దక్కలేదని ఆక్రోశిస్తున్నఆయన.. దానిని ఎలాగైనా సాధించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. అయితే.. ఈ క్రమంలో ఆయన సామ, దాన, బేధ, దండోపాయాల్లో కుదిరిన సమయం లో కుదిన దానినివినియోగిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు బేధోపాయాన్ని(వైరం) అనుసరించారు. సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారుమునుగోడులో సొంత అధికారం చలాయిస్తున్నారు. బెల్టు షాపులు నిర్వహించేది లేదన్నారు బాగానే ఉంది. కానీ.. ప్రభుత్వం ఇచ్చే లైసెన్సులు తెచ్చుకున్న మద్యం దుకాణాలపైనా ఆయన ఆంక్షలు పెట్టారు. అధికారులపై చిందులు తొక్కారు. కానీ, తాజాగా ఇప్పుడు రూటు మార్చేశారు.తాజా మాజీ మంత్రి కొండా సురేఖపై పార్టీ వ్యవహరించిన తీరుతో కంగుతిన్న రాజగోపాల్ రెడ్డి ఏకంగా సామ మార్గం(బుజ్జగించడం)పట్టారు.. అబ్బే నేను సీఎం ను ఏమీ అనలేదని.. అదంతా తనంటే గిట్టని ఓమీడియా చేసిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌తో తనకు ఎప్పుడూ ఎలాంటి పేచీ పంచాయితీలు లేవని కూడా రాజగోపాల్ వ్యాఖ్యానించారు. అంతే కాదు.. రేవంత్ రెడ్డి వంటి బలమైన నాయకుడికారణంగానే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని.. మళ్లీ మళ్లీ కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. ఇక్కడితో కూడా ఆగకుండా.. మునుగోడు నియోజకవర్గానికి 2 వేల కోట్ల రూపాయలనిధులు కూడా కేటాయించారని.. తద్వారా అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయన్నారు. కానీ, రెండు మాసాల కిందట తన నియోజకవర్గం పాకిస్థాన్‌లో ఏమైనా ఉందా? అని ఇదే రాజగోపాల్‌ప్రశ్నించడం గమనార్హం.ఇక, ఇప్పుడు మరో మాట కూడా చెప్పుకొచ్చారు. త్వరలో జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు తన నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతాననిరాజగోపాల్ చెప్పడం గమనార్హం. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారం తేలిపోయిన దరమిలా.. నిన్న మొన్నటి వరకు ఎగిరి పడిన చాలా మంది నాయకులు లైన్‌లోకి వచ్చేస్తున్నారు. కొందరు ఇంటి నుంచిబయటకు కూడా రాకపోగా.. మరికొందరు మీడియాకు ముఖం చాటేస్తున్నారు. ఈ జాబితాలో ఇప్పుడు కోమటిరెడ్డి చేరిపోయారు. మరి ముున్ముందు.. ఈ శాంతి వచనాలు ఇలానే కొనసాగుతాయో లేదోచూడాలి.

# పక్కా వ్యూహంతో కాంగ్రెస్

**హైదరాబాద్, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంచుకునే రాజకీయ వ్యూహాలు ఎప్పుడూ టాప్ లీడర్‌షిప్ నే లక్ష్యంగా చేసుకుంటాయనే విషయం మరోసారి రుజువైంది. గత మూడు రోజులుగా తెలంగాణశాసనసభ లోపల, బయట చోటుచేసుకున్న రచ్చ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు, అసెంబ్లీ గేట్ వద్ద పోలీసులతో జరిగిన తోపులాటలు కేవలం కొందరుఎమ్మెల్యేల తొందరపాటు చర్య కాదని సీఎం రేవంత్ శాసనసభ వేదికగా బాంబు పేల్చారు. ఈ మొత్తం హైడ్రామా వెనుక ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వేదికగా జరిగిన నేరపూరిత కుట్ర ఉందంటూ, నేరుగా బీఆర్ఎస్అధినేత కేసీఆర్‌నే సూత్రధారిగా వేలెత్తి చూపడం ద్వారా గులాబీ దళానికి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు.అసెంబ్లీలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం కేవలం ఒక రాజకీయ విమర్శ మాత్రమే కాదు. దానికి పక్కా లీగల్‌అండ్ పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేశారు. సెప్టెంబర్ 6న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన అంతర్గత సమావేశంలోనే కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల మార్కును, అసెంబ్లీ సమావేశాలనుఅడ్డుకోవడానికి ప్లాన్ సిద్ధమైందని రేవంత్ ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత నేతను ఉద్దేశపూర్వకంగా అవమానించడం, పోలీసుల విధులకు భంగం కలిగించడం వెనుక సభనుఅస్థిరపరిచే పక్కా వ్యూహం ఉందన్నారు. దీనిని కేవలం సభా నిబంధనల ఉల్లంఘనగా కాకుండా, IPC, దీటీూ కింద నేరపూరిత కుట్రగా పరిగణిస్తూ దర్యాప్తుకు ఆదేశించడం కాంగ్రెస్ వేసిన మాస్టర్‌స్ట్రోక్.ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం లీగల్‌గా సీరియస్‌గా తీసుకుంది. హైదరాబాద్ పోలీస్ జాయింట్ కమిషనర్ నేతృత్వంలో విచారణ జరిపించి, ఫామ్‌హౌస్ సమావేశానికి హాజరైన నేతలు, అక్కడి నుంచి వచ్చిన సూచనలు, అసెంబ్లీ వద్ద జరిగిన భౌతిక దాడుల మధ్య ఉన్న లింకులను టెక్నికల్, ఫోరెన్సిక్ ఆధారాలతో సేకరించాలని ఆదేశించారు. సీనియర్ ఐపీఎస్ పర్యవేక్షణలో జరిగే ఈ కుట్ర కోణం దర్యాప్తు.. రేపు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి, విచారణకు పిలిచే వరకూ వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒకవేళ కేసీఆర్‌ను లేదా ఆయన ప్రధాన అనుచరులను విచారిస్తే, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడటం ఖాయం.కాంగ్రెస్ సర్కార్ వేసిన ఈ బిగ్ ట్రాప్ నుంచి బయటపడటం బీఆర్ఎస్‌కు అతిపెద్ద సవాలే. బీఆర్ఎస్ ఇప్పటికే ఈ ఆరోపణలను తిప్పికొట్టేందుకు లీగల్ , విక్టిమ్ కార్డ్‌ను వాడుతోంది. అసెంబ్లీ గేట్ వద్ద మహిళా ఎమ్మెల్యేల పట్ల, సీనియర్ నేతల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై హైకోర్టును, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించి పోలీస్ యంత్రాంగాన్ని రక్షణలో పడేసే ప్రయత్నం చేస్తోంది. రేవంత్ రెడ్డి కావాలనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ, తమ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కేసీఆర్ పేరును లాగుతున్నారని బీఆర్ఎస్ వాదిస్తోంది. రేవంత రెడ్డి ఆడిన ఈ గేమ్‌తో ప్రతిపక్షం అనుకున్న అజెండా పూర్తిగా దారి తప్పింది. కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలు , ఆరు గ్యారెంటీలు అంశాలపై చార్జ్‌షీట్ ద్వారా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావించిన బీఆర్ఎస్.. ఇప్పుడు కేసీఆర్ కుట్ర – దళిత స్పీకర్‌కు అవమానం అనే కొత్త కాంగ్రెస్ నెరేటివ్‌ను డిఫెండ్ చేసుకునే పనిలో పడింది. కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్సీల సస్పెన్షన్ల చుట్టూ తిరిగిన చర్చను రేవంత్ రెడ్డి ఒక్క దెబ్బతో నేరుగా కేసీఆర్ వర్సెస్ కాంగ్రెస్ సర్కార్ గా మార్చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయాల్లో చిన్న చిన్న నేతలతో కాలక్షేపం చేయకుండా, నేరుగా ప్రధాన ప్రత్యర్థి మూలాలనే దెబ్బకొట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. విచారణ పేరుతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ఈ కేసులోకి లాగడం ద్వారా బీఆర్ఎస్ అగ్రనాయకత్వాన్ని మానసికంగా, లీగల్‌గా ఒత్తిడికి గురిచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజయం సాధించింది. రాబోయే రోజుల్లో ఈ సీనియర్ ఐపీఎస్ విచారణ ఏ మలుపు తిరుగుతుందో, గులాబీ దళం దీనికి ఎలా బదులిస్తుందో వేచి చూడాలి.


# అసెంబ్లీలో రోజుకు రూ.8-12 లక్షల ఖర్చు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు.. 6 రోజులు నిర్వహించాలని నిర్ణయించారు. అంటే.. ఈ గురు, శుక్ర, శనివారంతో ఈ సభలకు ముగింపు పలకనున్నారు. కీలకమైన బిల్లులను ఈ సభలో ప్రవేశపెట్టి ఆమోదించుకోవాలని ప్రభుత్వం పక్షం నిర్ణయించుకుంది. అలాగే.. వెయ్యిరోజుల పాలన పై కూడా చర్చించి.. ప్రజలకు ఏయే మేళ్లు చేశారు.. ఏమేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు.. అనే విషయాలనుకూడా వివరించాలని నిర్ణయించారు. అజెండాలోనూ వీటిని పేర్కొన్నారు.ప్రధాన ప్రతిపక్షం బీఆర్ ఎస్ విషయానికి వస్తే.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను.. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, హైడ్రా కమిషనర్‌వ్యవహారం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, ఎల్ నినో ప్రభా వం సహా.. ఇతర అంశాలను కూడా ప్రస్తావించాలని నిర్ణయించుకుంది. తద్వారా ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనితొలుత నిర్ణయించింది. కానీ, అనూహ్యంగా అసెంబ్లీ వాతావరణమే మారిపోయింది. మూడు రోజుల అసెంబ్లీలో ఒక్కటంటే ఒక్క సమస్య కూడా ప్రస్తావనకురాలేదు. అటు అధికార పక్షం, ఇటు ప్రధానప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగు కోవడమే సరిపోయింది. అసెంబ్లీ తొలి రోజు సోమవారం.. వెయ్యి రోజుల పాలనలో ఏమీ జరగలేదని చెబుతూ.. నల్ల టీషర్టులు ధరించి నిరసన వ్యక్తం చేయడంనుంచి స్పీకర్‌పై బీఆర్ ఎస్ ఎమ్మెల్సీలు.. చేసిన వ్యాఖ్యలు సభను కుదిపి వేశాయి. పోనీ రెండో రోజైనా సర్దుకున్నాయా? అంటే.. లేదు. ఎమ్మెల్సీల వ్యవహారం.. ఇరుపక్షాల మాటల దాడితోనే సభా సమయంకరిగిపోయింది బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల పై కాంగ్రెస్ పార్టీ, కాదు.. మీరే మమ్మల్ని అవమానించారని.. మహిళలపైనా దాడులు చేశారని బీఆర్ ఎస్ నేతలు యుద్ధాన్ని తలపించేలా సభలో వాగ్యుద్ధంచేసుకున్నారు. ఫలితంగా.. సభలో రభస తప్ప.. మరేమీ కనిపించలేదు. రోజుకు 8– 12 లక్షల రూపాయల మేరకు ఖర్చు చేస్తున్న సభలో ఒక్క ప్రజా సమస్యపైనా.. నాయకులు నోరు విప్పకపోవడం గమనార్హం. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఎల్ నినో.. రాజధానిలో అడుగంటుతున్న శాంతి భద్రతలు..(డీజీపీ ఆనందే వెల్లడించారు) వంటి అంశాలపై ఒక్కరు సైతం మాట్లాడకపోవడం గమనార్హం. మరిరభస ఎవరి కోసం.. రేపు సభ అయిపోయిన తర్వాత.. ఎవరి మానాన వారు తమ తమ పనుల్లో ఉంటారు. మరి ప్రజా సమస్యలపై చర్చించేది ఎప్పుడు? అనేది ధర్మసందేహం.!

# రామప్పను కబళిస్తున్న మైనింగ్

**వరంగల్, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** ములుగు జిల్లాలో ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టుపై స్థానికులు, పర్యావరణవేత్తలు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రఖ్యాతి గాంచిన రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై మైనింగ్ ప్రభావం చూపే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభ్యంతరాల నేపథ్యంలో ములుగు జిల్లా కలెక్టర్ ప్రతిపాదిత ప్రాజెక్టుజియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేశారు. శాస్త్రీయ, పర్యావరణ అధ్యయనాల అనంతరం నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు.యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందినతెలంగాణలోని చారిత్రక రామప్ప ఆలయానికి సమీపంలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ బొగ్గు గనుల ప్రాజెక్టు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో చేపట్టాలనిప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయంతో పాటు 3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామప్ప చెరువుపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్తులు, పర్యావరణవేత్తలు, వారసత్వపరిరక్షణ కార్యకర్తలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించి స్థానికులు, పాలంపేట స్పెషల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎస్‌డీఏ) కమిటీ సభ్యులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ (కేహెచ్‌టీ) ప్రతినిధులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ములుగు జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవ్‌రావు భోర్కడే మంగళవారం ప్రతిపాదిత మైనింగ్ ప్రాజెక్టు జియో ట్యాగింగ్ ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మైనింగ్ ప్రాజెక్టుపై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ హేమంత్.. శాస్త్రీయ, పర్యావరణపరమైన అంచనాలు పూర్తి అయిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.ఈ అంశంపై నిర్వహించిన సమావేశాల్లో జిల్లా యంత్రాంగంతో పాటు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్, పీఎస్‌డీఏకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రామప్ప ఆలయం , చెరువు, పరిసర గ్రామాలపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని వారసత్వ పరిరక్షణవర్గాలు చెబుతున్నాయి. ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌ను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్, మాజీ ప్రొఫెసర్ ఎం. పాండురంగారావు వ్యతిరేకించారు. గనుల తవ్వకాల కోసం బ్లాస్టింగ్, డ్రిల్లింగ్, భారీ యంత్రాలవినియోగం చేపడితే రామప్ప చెరువు నిర్మాణంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రామప్ప చెరువుకు సుమారు 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని.. దాని నిర్మాణానికి ఏదైనా నష్టం జరిగితే దిగువ ప్రాంతాల్లోని గ్రామాలపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని పాండురంగారావు పేర్కొన్నారు. చెరువుకు సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టడం కూడా పలు ప్రమాదాలకు దారితీయవచ్చని.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఉపసంహరించుకోవాలని కోరారు.ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు 40.4 మిలియన్ టన్నుల బొగ్గునువెలికితీసేందుకు సింగరేణి గతంలో అనుమతులు పొందినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం 19 ఏళ్ల మైనింగ్ లీజు కూడా పొందినట్లు సమాచారం. ప్రాజెక్టు పరిధిలోని కొంత భూమిని సంస్థ ఇప్పటికే సేకరించి.. భూయజమానులకు పరిహారం చెల్లించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ప్రాజెక్టులో సుమారు 314 హెక్టార్ల అటవీ భూమి.. మరో 1,448 హెక్టార్ల వ్యవసాయ, ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉన్నట్లు పేర్కొంటున్నారు. దీంతో మైనింగ్ వల్ల పర్యావరణంతో పాటు స్థానికుల జీవనోపాధిపై కూడా ప్రభావం ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు 2021 జూలైకి ముందే సమర్పించగా.. అదే ఏడాది డిసెంబర్‌లో మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలనే ప్రణాళిక ఉన్నట్లు సమాచారం. కానీ.. 2021 జూలై 25వ తేదీన రామప్ప ఆలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ హోదా లభించింది. దీంతో పాలంపేట, పరిసర గ్రామాల ప్రజలు ఆలయ పరిరక్షణ కోసం సేవ్ రామప్ప ఉద్యమాన్ని ప్రారంభించారు. స్థానికులు, వారసత్వ పరిరక్షణ కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో సింగరేణి ఈ ప్రాజెక్టును అప్పట్లో నిలిపివేసినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాజెక్టును తిరిగి ముందుకు తీసుకెళ్లే అంశంపై చర్చలు మొదలవడంతో పాలంపేట, పరిసర గ్రామాల ప్రజలు మరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్నారు. రామప్ప ఆలయం, చెరువు, అటవీ ప్రాంతం, స్థానిక పర్యావరణ వ్యవస్థను కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

## పాఠశాలలకు షూస్, టై, బెల్ట్‌లు పంపిణీ



పాఠశాలలకు యూనిఫాం షూ బెల్టు చేస్తున్న ఎంఈఓ వీరభద్రం

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న షూస్, టై, బెల్ట్‌లను శుక్రవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక మండల వనరుల కేంద్రం లో పి ఎస్ యు పి ఎస్ హెచ్ ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ వీరభద్రం మాట్లాడుతూ విద్యార్థుల్లో పాఠశాల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, పాఠశాలల్లో క్రమశిక్షణ, ఏకరూపతనుపెంపొందించేందుకు యూనిఫాం సంబంధిత సామగ్రి పంపిణీ ఉపయోగపడుతుందని పాఠశాలల వారీగా షూస్, టై, బెల్ట్‌లను సంబంధిత ఉపాధ్యాయులకు అందజేసి, విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ఉత్తమ ఉపాధ్యాయుడు డాక్టర్ రమేష్ ను ఘనంగా సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాధిక, కళాశాల బృందం

**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం నందు అర్థశాస్త్ర అధ్యాపకుడికి 2026 సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాధిక అధ్యక్షతన కళాశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ కళాశాలకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం చాలా సంతోషదాయకమని, ఈ అవార్డు రావడం వల్ల కళాశాల రాష్ట్రస్థాయిలో పేరుపొందిందని ఆమె కొనియాడారు. ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు రావడానికి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని, ఈ అవార్డు రావడం పట్ల డాక్టర్ రమేష్ ని ఆమె ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంఘ అధ్యక్షుడు ప్రొఫెసర్ సంగీ రమేష్ మాట్లాడుతూ ఈ అవార్డు రావడం వల్ల ఉపాధ్యాయుల మీద బాధ్యత ఇంకా పెరుగుతుందని భవిష్యత్తులో ఈ కళాశాల అభివృద్ధికి అందరూ పాటుపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ ప్రొఫెసర్ బండి రాజు, ప్రొఫెసర్ సురేష్, జి.సిటిఏ సెక్రటరీ డాక్టర్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ సివి పవన్ కుమార్, సురేష్ డాక్టర్ ఏ రచన, డాక్టర్ డివి రావు, వీరారెడ్డి, హృదయ రాజు, డిఎస్ఎస్ఆర్ కృష్ణ, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ సురేఖ, డాక్టర్ నీలిమ, కరుణ, డాక్టర్ శంకర్, నరేందర్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట విశిష్టతను గ్రామ గ్రామాన వెల్లడించాలి



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ : 11** అణచివేత, దోపిడీ, వెట్టి చాకిరి విముక్తి నుండి ఆంధ్ర మహాసభ స్ఫూర్తితో అగ్ని జ్వాలల సాగిన తెలంగాణ సాయుధ రైతంగ పోరాట విశిష్టతను గ్రామ, గ్రామాన తెలియపరచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతిలో అన్నారు. స్థానిక మంగపతి రావు భవనంలో గడ్డిపాటి రాజారావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ని బాంచెన్ దొర... నీ కాల్మొక్తా అంటూ దొరలు,భూస్వాములకు ఊడిగం చేసిన తెలంగాణ పేదోడిని ఆత్మగౌరవంతో నిలబెట్టి, బంధుకు చేత పట్టించి, నిరంకుశ పాలకులైన జాగిరిదారులు, దేశముఖ్, పటేల్, పట్వారిలు,రజకార్లను గ్రామాల నుండి పట్టణాలకు పరుగులేత్తిశీచిన మహత్తర పోరాటం తెలంగాణ సాయుధ పోరాటం అని అన్నారు. ఈ మహత్తర పోరాటాన్ని వక్రీకరించడానికి నేడు బిజెపి ప్రయత్నిస్తుందని, ఇది ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు చేసిన పోరాటం అని వక్రీకరిస్తూ తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు. విస్నూర్ దేశముఖ్ రామచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాపరెడ్డి, కల్లూరు భూస్వామి రాఘవరావు లాంటి ఎందరో భూస్వాములకు ఆకృత్యాలు, ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడిన ముఖ్దూం మొహియుద్దీన్, బంధగీ, జర్నలిస్టు షోయబుల్లాఖాన్ ముస్లింలు అయినప్పటికీ నిజాశీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు పోరాటం చేశారని గుర్తు చేశారు.అనేక మంది కమ్యూనిస్టుల బలిదానాలతోనే తెలంగాణ రైతాంగ పోరాటం విజయవంతమైందని వివరించారు. అనేకమంది కమ్యూనిస్టుల బలిదానాలతో సాయుధపోరాటం విజయవంతమైందని పునరుద్ఘటించారు. కానీ ఆ పోరాటంతో సంబంధం లేని బీజేపీ నేడు ఆ చరిత్రను వక్రీకరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.నాడు నైజాంకు తొత్తులుగా ఉన్నవాళ్లే నేడు బీజేపీ ముసుగులో మతరంగు పులిమితే చరిత్ర క్షమించదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు అంబటి వీరస్వామి, విపి వెంకటేశ్వర్లు, ఇమ్మడి గోవిందు, మల్లెల నాగమణి, చింత ఎల్లయ్య, ధారావత్ కై బాబు, చింత మౌనిక,కుంట రామకృష్ణ, అలవాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

# గణేష్ మండపాలకు 'ఆన్‌లైన్ ఇంటిమేషన్' తప్పనిసరి




అవగాహన సదస్సులో ఎస్ఐ సాయికుమార్

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్: 11** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గార్ల మండలంలో ఏర్పాటు చేయనున్న గణేష్ మండపాల నిర్వాహకులకు గార్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో శు క్రవారం అవగాహన సదస్సు నిర్వహించి మండపాల ఏర్పాటుతో పాటు ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీస్‌శాఖ నిబంధనలను నిర్వాహకులకు వివరించారు. అనంతరంఈ సందర్భంగా ఎస్ఐ సాయికుమార్ మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అనుమతి పొందాలని సూచించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, మండపాల ఏర్పాటుకు ముందుగానే పోలీస్‌శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపారు. డీజేలకు అనుమతి లేదని, లౌడ్‌స్పీకర్ల వినియోగంలో నిబంధనలు పాటించాలని, రాత్రి 10 గంటల తర్వాత శబ్ద కాలుష్యానికి కారణమయ్యే విధంగా మైకులు, లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదని స్పష్టం చేశారు. మండపాల వద్ద విద్యుత్ భద్రతకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి అల్లర్లు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భద్రతా చర్యల్లో భాగంగా వీలైన చోట్ల సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఉత్సవాల సమయంలో యువత సంయమనం పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు పాల్గొన్నారు.

# జీవో 98ను తక్షణమే రద్దు చేయాలి సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారధి

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్: 11** మున్నేరు పాలేరు లింకు కెనాల్‌కు సంబంధించిన జీవో 98ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక పోస్టాఫీస్ లో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఢిల్లీకి లెటర్ ని పోస్ట్ చేశారు. అనంతరం ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారధి మాట్లాడుతూ మున్నేరు పాలేరు లింకు కెనాల్ ప్రతిపాదనతో ఈ ప్రాంత రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని కెనాల్ నిర్మాణం జరిగితే సాగుభూములు కోల్పోయే ప్రమాదం ఉండటంతో పాటు, రైతుల జీవనోపాధి దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు, పంట పొలాలు, చెరువులు, వాగులు, భూగర్భ జలాలపై ఈ ప్రాజెక్టు ప్రభావం పడే అవకాశం ఉందని అన్నారు. వ్యవసాయ భూములు కోల్పోవడం వల్ల రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఉపాధి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా కెనాల్ నిర్మాణం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం, సహజ నీటి ప్రవాహాలకు ఆటంకం కలగడం, స్థానిక ప్రజలకు తాగునీరు సాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను, రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.రైతుల ప్రయోజనాలకు, ప్రజా హక్కులకు, పర్యావరణ పరిరక్షణకు విరుద్ధంగా ఉన్న జీవో98ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు నష్టం కలిగించే ఏ నిర్ణయాన్నీ అంగీకరించబోమని,



పోస్ట్ ఆఫీస్ లో లెటర్ పోస్ట్ చేస్తున్న సిపిఐ జిల్లా నాయకులు విజయ సారధి

అవసరమైతే రైతులు, ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.రైతుల భూములు ప్రజల హక్కులు కాపాడే వరకు సిపిఐ పోరాటం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టేబోయిన శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, ధూపాటి జనార్ధన్,భుక్య హరినాయక్,అన్నం శ్రీనివాస్, మాగం లోకేష్, గుగులోత్ సక్రు,రాంబాబు, తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డ్ మృతి

### ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
### నిందితుడి రిమాండ్




**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డ్ మృతి చెందిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన రోహిత్ సింగ్ యాదవ్ (21), ఉపాధి కోసం అని మూడు రోజుల క్రితం హైదరాబాద్ వచ్చి, కోహెడ రోడ్డులోని ఒక ఫంక్షన్ హాల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా చేరాడు. కాగా, ఈ నెల 7వ తేదీన రాత్రి విధులు ముగించుకుని భోజనం కోసం శ్రీ గురు కాలేజీ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుండి అతివేగంగా వచ్చిన కారు అతడిని బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన రోహిత్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుని బాబాయి మిథిలేషు సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు.

**నిందితుడి రిమాండ్**

కేసును సవాలుగా తీసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు, సంఘటనా స్థల పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్ ను పరిశీలించారు. సాంకేతిక ఆధారాలను సేకరించి, విశ్లేషించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించారు. పీర్జాదిగూడకు చెందిన బి.టెక్ విద్యార్థి వరుణ్ అనే వ్యక్తి ఎర్టిగా కార్ వాహనాన్ని అతివేగంగా, తీవ్ర నిర్లక్ష్యంగా నడిపి, రోహిత్‌ను ఢీకొట్టినట్లు ధృవీకరించి, నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి, అనంతరం నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

## గణేష్ మండపాల నిర్వాహకులతో పోలీసుల సమన్వయ సమావేశం



గణేష్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మద్ది మహేందర్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** గణేష్ ఉత్సవాలు--2026 ఏర్పాట్లలో భాగంగా, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గణేష్ మండపాల నిర్వాహకులు, వీరపట్నం గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ, పోలీస్ కమిషనర్ జారీ చేసిన సూచనలు, మార్గదర్శకాలను నిర్వాహకులకు వివరించడంతో పాటు, ఉత్సవాల సమయంలో పాటించాల్సిన ముఖ్యమైన చేయాల్సినవి, చేయకూడనివి గురించి అవగాహన కల్పించారు. గణేష్ మండపాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం, ట్రాఫిక్, శబ్ద నియంత్రణ నిబంధనలు పాటించడం, క్రమశిక్షణను కాపాడడం, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడడం, ఉత్సవాలు సురక్షితంగా, సజావుగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.పి.వి. రాజు, ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌ఓ ఎం. మహేందర్ రెడ్డి, సంబంధిత పోలీస్ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.

# దుమ్మాకొట్టిన ఐఏఎస్ అధికారులు...
# సీఎం చంద్రబాబుకు షాక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజధాని అమరావతిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి 28 జిల్లాల కలెక్టర్లతోపాటు సెక్రటరీలు, ఐూణలు హాజరు కావాల్సివుంది. అయితే కొందరు ఐఏఎస్ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరు కావడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గమనించారు. తన ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుంటే ఐఏఎస్ అధికారులు ఎలాంటి అనుమతి లేకుండా దుమ్మా కొట్టడంపై సీరియస్ అయ్యారు. ఏం తమాషానా? అంటూ గైర్హాజరు అయిన అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని సీఎస్ సాయిప్రసాద్ ను ఆదేశించారు.దముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సుకు కొందరు సీనియర్ అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశం అయింది. శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో కొందరు అధికారులు లేకపోవడాన్ని సీఎం గమనించారు. ఒకరిద్దరు ఇతర పనులతో రాలేకపోయినట్లు సీఎస్ వివరించారు. అదేసమయంలో సమాచారం ఇవ్వకుండా ఉండిపోయిన అధికారుల విషయంలో మౌనం వహించారు. దీంతో సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన సమావేశానికి బాధ్యత గల అధికారులు రాకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. వాట్సాప్ మెసేజులపై చూపిస్తున్న శ్రద్ధ ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో చూపడం లేదని సీఎం మండిపడ్డారు. కలెక్టర్ల సమావేశానికి ఫోన్లు లేకుండా రావాలని తాను ముందే చెప్పానని సీఎం వ్యాఖ్యానించారు. అయినప్పటికీ చాలా మంది అధికారులు ఫోన్లు తీసుకుని రావడం, సమావేశ మందిరం బయట తమ సిబ్బందికి అప్పగించి మాటమాటకి వాట్సాప్ మెసేజులను చూసుకోవడానికి బయటకు వెళుతుండటం సీఎం ఆగ్రహానికి కారణమైందని అంటున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాను ఎంతో ఓపికగా సమావేశం కొనసాగిస్తుంటే, కలెక్టర్లు కనీసం 12 గంటలు కదలకుండా కూర్చోలేకపోతున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాగా, కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేయడంపై విస్తృత చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు సీఎంతోపాటు మంత్రులు, ఆయా శాఖల విభాగాధిపతులు, కలెక్టర్లు హాజరు అవుతారు. అయితే గతంలో లేనట్లు ఈ సారి సమావేశాలకు ఫోన్లు తేవొద్దని సీఎం ముందే ఆదేశించారు. అయినప్పటికీ అధికారిక విధులలో బిజీగా ఉండే అధికారులు తమతో ఫోన్లు తీసుకురావడం తప్పనిసరిగా మారిందని అంటున్నారు.

అర్జంటు సమాచారం, ఇతర అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు అన్నీ ఫోన్లలో జరుగుతున్న సమయంలో ఫోన్ లేకుండా ఎలా? అని కొందరు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫోన్లు వెంట ఉండటం వల్ల అధికారులు తాను చెప్పే అంశాలపై శ్రద్ధ వహించలేకపోతున్నారని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. ఇక సమావేశానికి ఫోన్లు తీసుకురావడం, ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో ఎక్కువ సమయం తీసుకోవడంపై సీఎం అసంతృప్తికి లోనరయ్యారని అంటున్నారు. దీంతో సమావేశంలోనే అందరినీ హెచ్చరిస్తూ దుమ్మా కొట్టిన వారి పేర్లు చదివి హెచ్చరికలు పంపారని అంటున్నారు. ఇక మంత్రులు కూడా ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని మందలించారు.

# చిన్న శ్రీను చేరిక.. టీడీపీలో వారికి ఇష్టం లేదు!!

**హైదరాబాద్ పెన్ పవర్:** విజయనగరం జిల్లా పరిషత్ చైర్మను, వైసీపీ కీలక నేత బొత్స మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరడం ఆ పార్టీలో విస్తృత చర్చకు దారితీస్తోంది. చిన్న శ్రీనుతో ఇప్పటివరకు యుద్ధం చేసిన వారిలో ఎక్కువ మంది ఆయన పార్టీలో రాకను జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. అలా అని అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించలేక తీవ్ర అంతర్మథనానికి లోనవుతున్నారని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా జడ్పీ చైర్మనుగా సర్వం తానై రాజకీయం నడిపిన చిన్నశ్రీనుతో టీడీపీకి చెందిన అనేక మంది నాయకులు నువ్వా-నేనా అన్నట్లు తలపడ్డామని, పరస్పర విమర్శలతో గత ఎన్నికల్లో చిన్నశ్రీనును నైతికంగా ఓడించామని చెబుతున్నారు. అలాంటి వ్యక్తిని ఇప్పుడు తమ పక్కన కూర్చోబెట్టుకుని ఎలా సమర్థించాలో అర్థం కావడం లేదని పలువురు టీడీపీ సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు.రెండు రోజుల క్రితం వైసీపీకి రాజీనామా ప్రకటించిన జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను ఆ వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ప్రత్యక్షమై అందరికీ షాక్ ఇచ్చారని అంటున్నారు. తాను వైసీపీని వీడుతానని కానీ, టీడీపీలో చేరతానని కానీ ఏ ఒక్కరికి ముందుగా చెప్పని చిన్న శ్రీను అత్యంత రహస్యంగా వ్యవహరించి ఆఖరి నిమిషంలో తన వ్యూహాన్ని బయటపెట్టారని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రి నివాసానికి చిన్న శ్రీను చేరుకుంటారని నిర్ధారించుకున్న కాసేపటికే జిల్లాలో ప్రజాప్రతినిధులు, సీనియర్లకు సమాచారం ఇచ్చారని అంటున్నారు. అంతేకాకుండా జిల్లా నేతలు అంతా మంగళగిరిలో నిర్వహిస్తున్న లీడర్ షిప్ సమ్మిట్ లో ఉండటంతో అందరినీ ముఖ్యమంత్రి నివాసానికి రావాల్సిందిగా ఆదేశించారని అంటున్నారు.ఇక సీఎం కార్యాలయ సిబ్బంది సూచనలతో ఉండవల్లిలో చంద్రబాబు నివాసానికి వెళ్లిన తర్వాత అక్కడ చిన్నశ్రీనును చూసిన పార్టీ నేతలు షాక్ కు గురయ్యారని చెబుతున్నారు. అప్పటికి కొద్దిసేపటి క్రితమే ఆయన పార్టీలో చేరతారని సమాచారం ఇచ్చి, ఆ వెంటనే కండువా కప్పేలా జరిగిన ఏర్పాట్లు చూసి టీడీపీ సీనియర్లు ఆశ్చర్యపోయారని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా పార్టీలో చేరికలను ప్రోత్సహించాల్సివున్నప్పటికీ జిల్లా స్థాయి నేత పార్టీలోకి వచ్చేముందు తమకు కనీస సమాచారం ఇవ్వలేదని కొందరు నేతలు అంతర్గత సంభాషణల్లో నొచ్చుకుంటున్నారని ప్రచారం



జరుగుతోంది.విజయనగరం జిల్లాలో టీడీపీ నేతలకు వ్యతిరేకంగా చిన్నశ్రీను సుదీర్ఘంగా రాజకీయం నడిపారు. కాంగ్రెస్, వైసీపీ పార్టీల తరఫున తెరముందు బొత్స, ఆయన సోదరులు, ఇతర కుటుంబ సభ్యులు రాజకీయం చేస్తే వారందరికీ వెన్నుదన్నుగా నిలుస్తూ తెరవెనుక చక్రం తిప్పి, వారి విజయానికి తగిన వ్యూహాలు రచించడం చిన్నశ్రీను చూసేవారని చెబుతున్నారు. అయితే బొత్స కుటుంబ రాజకీయం ఇలా కొనసాగినంత వరకు చిన్నశ్రీనుతో టీడీపీకి పెద్దగా ఇబ్బంది లేదని అంటున్నారు. కానీ, 2021లో ఆయన జడ్పీ చైర్మనుగా తెరముందుకు వచ్చిన తర్వాత రాజకీయం పూర్తిగా మారిపోయిందని అంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అనుసరించిన విధానాలనే చిన్న శ్రీను కూడా విజయనగరంలో అమలు చేయడంతో రాజకీయ కక్ష సాధింపులు ఎక్కువగా సాగాయని, తమ కార్యకర్తలు కేసులు ఎదుర్కొన్నారని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారని టీడీపీలోని కొందరు నేతలు ఎత్తిచూపుతున్నారు. అంతేకాకుండా పలువురు టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ పోస్టుల ద్వారా తమ నిరసన వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. సామాజిక, రాజకీయ సమీకరణాల పేరుతో ప్రత్యర్థులను పార్టీలోకి తేవడం వల్ల సొంత కేడర్ నష్టపోతుందన్న విషయాన్ని పార్టీ అధిష్టానం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

కాగా, చిన్నశ్రీను చేరికను టీడీపీలో జిల్లాస్థాయి నేతలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కొందరు నేతలు మాత్రం స్వాగతిస్తున్నారని అంటున్నారు. చిన్నశ్రీనును తీసుకోవడం వల్ల వైసీపీ వెన్నుముక విరిచేసినట్లైందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం జిల్లాలో ఉన్న నేతల్లో దూకుడుగా రాజకీయం చేసే నేతలు తక్కువగా ఉన్నారని, ఉన్న ఒకరిద్దరికి చిన్నశ్రీను జత కలిస్తే భవిష్యత్తులో పార్టీ మరింత బలపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్న వారు సైతం ఎక్కువగానే ఉన్నారంటున్నారు. ఇప్పటివరకు జిల్లాకు పెద్ద దిక్కుగా వ్యవహరించిన అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా వెళ్లిపోవడం, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఇప్పటికీ జిల్లాపై పట్టుసాధించలేకపోవడం వల్ల చిన్న శ్రీను రాక కలిసివస్తుందని మరికొందరు సమర్థిస్తున్నారు. మొత్తానికి చిన్న శ్రీను టీడీపీ కండువా కప్పుకోవడంపై ఆ పార్టీలో రెండు రోజులుగా వాడివేడి చర్చలు కొనసాగుతూనే ఉన్నాయని అంటున్నారు.

# కాలుష్య నియంత్రణలో ఢిల్లీ బెస్ట్

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** రాజధాని ఢిల్లీతో పోటీ పడడమే కాదు బెస్ట్ ర్యాంక్ ని విశాఖపట్నం అందుకుంది. దేశ రాజధానితో సమానంగా విశాఖ పెర్ఫార్మెన్స్ చేయడం ఇక్కడ విశేషం. ఏ విషయంలో అంటే కాలుష్య నియంత్రణలో. పకడ్బందీగా చర్యలు తీసుకుని విశాఖ దేశంలోనే మంచి ర్యాంక్ ని అందుకుంది. అలాగే ఢిల్లీ తో కలసి 21వ ర్యాంక్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో ఢిల్లీ విశాఖ 21వ ర్యాంక్ ని కలిసి పంచుకున్నాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026' ర్యాంకులలో విశాఖ ఈ విధంగా ఇంట్రెస్టింగ్ రిజల్ట్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకులలో లక్నోకు అగ్ర స్థానం దక్కింది. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో నంబర్ వన్ గా నిలిచింది. అలాగే ఇండోర్ రెండో స్థానంలో ఉంటే 195 పాయింట్లతో జబల్‌పూర్ మూడో స్థానంలో ఉంది. ఇక ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గత ఏడాది ఢిల్లీ 32వ స్థానంలో ఉంది. అయితే ఈసారి ఢిల్లీ తన ర్యాంకును మరింతగా మెరుగుపరుచుకోవడం విశేషంగా పేర్కొంటున్నారు. దేశంలో చూస్తే ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో ఉంటే పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి.ఏమిటీ ర్యాంకులు వీటి వెనక కథ ఏంటి అంటే ఈ ర్యాంకులు అందుకున్న నగరాల్లో కాలుష్యం పూర్తిగా తొలగిపోయింది అని కాదు, అయితే కాలుష్యం విషయంలో ఈ నగరాలు తీసుకుంటున్న కీలక చర్యలు, రోడ్లపై దుమ్ము ధూళీ లేకుండా సక్రమంగా ఉంచడం, పేరుకుపోకుండా ఘన వ్యర్థాల తొలగింపు, వాహనాల ద్వారా పరిశ్రమల ద్వారా వెదజల్లే ఉద్గారాలను వీలైనంత మేరకు తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, కాలుష్యం మీద ప్రజలలో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులను జాతీయ స్థాయిలో ప్రకటిస్తారు. ఈ నగరాలలో గాలి నాణ్యత తక్కువగా ఉండొచ్చు అయితే కాలుష్య నియంత్రణ చర్యలు బలంగా అమలు అవుతున్నందువల్ల ఏదో నాటికి నాణ్యమైన గాలి ఆ నగరాలకు దక్కుతుందని అంటున్నారు. జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తోంది నిజానికి ఢిల్లీ అంటేనే కాలుష్యం అని చెబుతారు. శీతాకాలంలో అయితే ఢిల్లీలో ఎవరూ ఉండలేని పరిస్థితి తలెత్తుతుంది. విపరీతంగా వచ్చే పొగమంచు అలాగే విషపూరితమైన గాలి ఉన్నప్పటికీ ఢిల్లీ కాలుష్యాన్ని నియంత్రించేందుకు తీసుకున్న చర్యలు గొప్పగా ఉన్నాయని అంటున్నారు. దీని వల్ల ఢిల్లీ ఏదో నాటికి కాలుష్యం కోరల నుంచి బయట పడుతుంది అని అంటున్నారు. అలా పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. ఇక విశాఖ విషయం తీసుకుంటే అంతకంతకు ఈ నగరంలోనూ కాలుష్యం పెరిగిపోతోంది. అయితే దానిని నిరోధించేందుకు సరైన సమగ్రమైన చర్యలు చేపడుతూ విశాఖ కూడా దీ బెస్ట్ అనిపించుకుంటోంది. అందుకే మంచి ర్యాంక్ ని పొందింది అని అంటున్నారు.

## వారసుల కోసమే సీనియర్ల ప్రయత్నాలు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఖాళీ అవుతోందన్న సంకేతాలు రోజురోజుకూ మరింత బలపడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ఘోర పరాభవం తర్వాత ఉనికి కోల్పోతున్న వైఎస్ఆర్‌సీపీలో కొనసాగడం తమ రాజకీయ భవిష్యత్తుకే కాకుండా, తమ వారసుల అరంగేట్రానికి కూడా ముప్పు అని సీనియర్ నేతలు గ్రహించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఈ ఒక్క ఘటన ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వైఎస్ఆర్‌సీపీ అగ్రనేతలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లయింది.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు చెందిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి కీలక నేతలు టీడీపీ, జనసేన అధిష్టానాలతో తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ వలసల వెనుక ఉన్న ప్రధాన రాజకీయ కారణం రాబోయే మహిళా రిజర్వేషన్లు, వారసత్వ రాజకీయం . 2029 నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలుకావడం ఖాయమని తేలడంతో పాటు, ఇటీవల టీడీపీ మహానాడులో మంత్రి నారా లోకేష్ బిల్లు పాస్ కాకపోయినా పార్టీ తరఫున మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని సంచలన ప్రకటన చేశారు. దీంతో తమ కుమార్తెలను లేదా కోడళ్లను రాజకీయ బరిలోకి దించాలనుకుంటున్న సీనియర్ నాయకులకు కూటమి పార్టీలే సురక్షితమైన, ఆశాజనకమైన వేదికలుగా కనిపిస్తున్నాయి.వైఎస్ఆర్‌సీపీ జెండాపై పోటీ చేస్తే భవిష్యత్తులో గెలిచే అవకాశాలు శూన్యమని, తమ వారసుల రాజకీయ జీవితాలు ప్రారంభంలోనే దెబ్బతింటాయని ఈ సీనియర్లు భావిస్తున్నారు. అందుకే, చిన్న శ్రీను తన కుమార్తెను జెడ్పీ చైర్‌పర్సన్‌గా నిలబెట్టే ముందస్తు వ్యూహంతో టీడీపీ పసుపు కండువా కప్పుకున్నట్లే.. మిగిలిన ముగ్గురు ఉమ్మడి జిల్లాల నేతలు కూడా తమ మహిళా వారసులను స్థానిక సంస్థలు, రాబోయే అసెంబ్లీ స్థానాలకు స్థిరపరచేందుకు కూటమి నేతలతో రాయబారాలు నెరుపుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం వైపు నుంచి కూడా ఈ వలసలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఏకపక్ష విజయాలు సాధించి, ప్రతిపక్షాన్ని క్షేత్రస్థాయి నుంచి పూర్తిగా తుడిచిపెట్టాలనేది కూటమి వ్యూహం. బలమైన ఓటు బ్యాంక్, సామాజిక వర్గ సమీకరణాలు ఉన్న వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల వారసులను చేర్చుకోవడం ద్వారా తమ గెలుపు అవకాశాలను మరింత సుగమం చేసుకోవచ్చని టీడీపీ-జనసేన వర్గాలు లెక్కిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ ఒక రకమైన శూన్యతలోకి జారుకుంటోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరి, పార్టీ పునర్నిర్మాణంలో కొరవడిన దిశానిర్దేశం వల్ల విసిగిపోయిన నేతలు.. తమ వారసుల భవిష్యత్తును కాపాడుకునేందుకు పవర్ అండ్ ఫ్యూచర్ ఉన్న కూటమి వైపే మొగ్గు చూపుతున్నారు. రాబోయే స్థానిక పోరు నాటికి ఉత్తరాంధ్ర వైఎస్ఆర్‌సీపీ నుంచి మరిన్ని వికెట్లు పడటం, వారసుల రాజకీయ రంగానికి కూటమి వేదికగా మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

## వైసీపీకి జీవన్మరణ సమస్య

**విజయవాడ, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగే సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ తీవ్రమైన ఒత్తిడికి, కంగారుకు గురవుతున్నట్లు స్పష్టమవుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాభవం నుంచి కోలుకోకముందే ఎదురవుతున్న స్థానిక పోరులో ఉనికి కాపాడుకోవడం ఆ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారింది. ఈ క్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకత్వం శాంతియుత ప్రజాస్వామ్య పోరాటాలను ఎంచుకోవడానికి బదులుగా, రక్తాభిషేకాలు, నరుకుతాం, చంపుతాం వంటి తీవ్రమైన ఆవేశపూరిత వ్యాఖ్యలతో క్యాడర్‌ను రగల్చే ప్రయత్నం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో పాటు ఆ పార్టీ ముఖ్య నేతలు వీధి పోరాటాల పేరిట ఇస్తున్న పిలుపులు, వాడుతున్న భాష క్షేత్రస్థాయి శ్రేణులను మరింత ఇరకాటంలో పడేస్తున్నాయి. గత ఐదేళ్ల పాలనలో నమోదైన అక్రమ కేసులు, అధికార మార్పిడి తర్వాత చోటుచేసుకున్న చట్టపరమైన పరిణామాలతో ఇప్పటికే వందలాది మంది వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటువంటి సున్నితమైన సమయంలో తిరగబడండి, తెగబడండి అంటూ నాయకత్వం ఇచ్చే ఆవేశపూరిత ఉపన్యాసాలు క్యాడర్‌ను శాంతింపజేయడానికి బదులు, మరిన్ని కొత్త కేసుల్లోకి నెట్టివేసే ప్రమాదం ఉంది.ఈ తరహా ఆవేశపూరిత రాజకీయం వెనుక వైఎస్ఆర్‌సీపీ తీవ్రమైన కంగారు, అభద్రతా భావం దాగి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై వేగంగా అడుగులు వేస్తుండటంతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు లేదా ఏకపక్ష విజయాలు సాధిస్తే వైసీపీ క్యాడర్ పూర్తిగా ఖాళీ అయిపోతుందనే భయం ఆ పార్టీని వెంటాడుతోంది. ప్రజాదరణతో ఎన్నికలను ఎదుర్కోవడానికి తగినంత గ్రౌండ్ వర్క్ లేకపోవడంతో, ఘర్షణ పూరిత వాతావరణాన్ని లేదా సెంటిమెంట్‌ను రగల్చడం ద్వారా ఎన్నికలను వాయిదా వేయించడమో, లేదా వైలెంట్ నేరేటివ్‌తో ఉద్రిక్తతలు సృష్టించి ప్రభుత్వంపై వేధింపుల ముద్ర వేయడమో ఒకే ఒక్క మార్గంగా వైసీపీ ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఈ తీవ్రమైన వ్యాఖ్యలు పార్టీకి మైలేజ్ ఇవ్వడం కంటే తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. కేసుల్లో ఇరుక్కుని జైలుపాలు లేదా కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తే, తమను ఆదుకోవడానికి ఏ సీనియర్ నాయకుడూ ముందుకు రాడనే నిజం ఇప్పటికే వైఎస్ఆర్‌సీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వానికి అర్థమైంది. నాయకులు మైకుల ముందు ఆవేశంగా మాట్లాడి వెళ్ళిపోతారు, కానీ చట్టపరమైన పరిణామాలు అనుభవించాల్సింది క్షేత్రస్థాయి కార్యకర్తలే. దాంతో నాయకత్వం ఎంత రగిల్చినా, క్యాడర్ మాత్రం మళ్లీ కేసులు కొనితెచ్చుకోవడానికి సిద్ధంగా లేదు. అంతిమంగా, హింస లేదా రెచ్చగొట్టే రాజకీయాలను నమ్ముకోవడం ద్వారా ఏ పార్టీ కూడా సుదీర్ఘకాలం నిలబడలేదు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడితే దానికి చట్టపరంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎదురుతిరగాలి తప్ప.. నరకడం, చంపడం వంటి పదజాలంతో రాజకీయం చేస్తే పార్టీ మరింత బలహీనపడటంతో పాటు సామాన్య ప్రజల్లో మరింత వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుంది. స్థానిక పోరు వేళ వైఎస్ఆర్‌సీపీ అనుసరిస్తున్న ఈ ఆవేశపూరిత వ్యూహం పార్టీని పునరుద్ధరించడానికి బదులు, ఉన్న క్యాడర్‌ను కూడా దూరం చేసే ప్రమాదంలో పడేస్తోంది

## కాంగ్రెస్ కు దగ్గరవుతున్న జగన్



**కడప, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రమంగా కాంగ్రెస్ అధిష్టానానికి దగ్గరవుతున్నారనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వైఎస్ జగన్ సుదీర్ఘంగా చర్చలు జరిపారన్న కథనాలు రావడం, ఈ భేటీ వార్తలను అటు కాంగ్రెస్ కానీ, ఇటు వైఎస్ఆర్‌సీపీ కానీ స్పష్టంగా ఖండించకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. కేంద్రంలోని అధికార పక్షానికి అనుకూలంగా ఉంటూ వస్తున్న జగన్, సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత తన జాతీయ రాజకీయ వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి.ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తూ.. కాంగ్రెస్ అనుకూల సెఫాలజిస్టులు , విశ్లేషకులు జగన్-కాంగ్రెస్ కలయిక పై కొత్త లాజిక్కులు తెరపైకి తెస్తున్నారు. గత ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన ఓటు బ్యాంక్ రాకపోయినా, ఓట్ల చీలిక వైఎస్ఆర్‌సీపీ విజయావకాశాలను కొంతవరకు దెబ్బతీసిందనే అంచనా ఉంది. భవిష్యత్తులో వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్ ఒకే గొడుగు కిందకి వచ్చినా లేదా ఇండియా కూటమి భాగస్వామిగా వైసీపీ చేరినా.. ఏపీలో కూటమికి గట్టి పోటీ ఇవ్వవచ్చని, కేంద్రంలోనూ బీజేపీకి వ్యతిరేక పక్షంలోకి మారేందుకు జగన్‌కు రోడ్‌మ్యాప్ సిద్ధమవుతోందని విశ్లేషిస్తున్నారు.అయితే, ఈ రాజకీయ పునరేకీకరణ వెనుక అతిపెద్ద అడ్డంకి వైఎస్ షర్మిల పాత్ర. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిల.. వైఎస్ జగన్‌పై, ఆయన పాలనా శైలిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఆస్తి వివాదాలు, కుటుంబ విభేదాలు ఉన్నాయి. సయోధ్య కుదిరితే తప్ప కాంగ్రెస్-వైసీపీ మైత్రి సాధ్యం కాదనే వాదన ఒకవైపు ఉంది. కానీ, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు అన్నట్లుగా.. హైకమాండ్ ఆదేశిస్తే ఢిల్లీ పెద్దల సమక్షంలో కుటుంబ కలహాలను పక్కనబెట్టి ఒక అవగాహనకు వచ్చే అవకాశాలను కూడా కొట్టిపారేయలేము.వైఎస్ జగన్ ఈ దిశగా అడుగులు వేయడానికి మరో బలమైన కారణం --- కేంద్రంలోని అధికార పక్షం నుంచి గతంలో లభించినంత పొలిటికల్ రక్షణ ఇప్పుడు లభించడం లేదన్న భావన. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నమోదు అవుతున్న కేసులు, ఈడీ, సీబీఐ విచారణల వేగం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో ప్రాంతీయంగా ఒంటరిపోరు చేయడం కంటే, జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో జతకట్టడం ద్వారా వ్యూహాత్మక రాజకీయ రక్షణ దక్కుతుందనే ఆలోచనలో వైసీపీ అధినాయకత్వం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.కేసీ వేణుగోపాల్‌తో నడిచిన ఈ చర్చలు కేవలం ఆరంభం మాత్రమేనా లేక పక్కా ప్రణాళిక ప్రకారం సాగుతున్న పొలిటికల్ మూవా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. ఒకవేళ జగన్ నిజంగానే కాంగ్రెస్‌తో చేతులు కలిపితే, అది ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ మార్పులకు దారితీస్తుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఒక్క ప్రకటన.. భారతీయులు, సిక్కులు ఆగ్రహజ్వాలలకు వణికిన అమెరికా.. దెబ్బకు డిలీట్





అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారిని దారికి తెచ్చి వీలైనంత త్వరగా స్వదేశాలకు సాగనంపడానికి డొనాల్డ్ ట్రంప్ సర్కారు పన్నుతున్న వినూత్న ప్లాన్లు చూస్తుంటే.. వారి మార్కెటింగ్ టీమ్‌కు క్రియేటివిటీ కాస్త సరిహద్దులు దాటి ప్రవహిస్తోందనిపిస్తోంది. “సగౌరవంగా మీ మూటముల్లె సర్దుకుని దేశం వదిలి పోతారా.. లేక మేమే ప్రత్యేక విమానం వేసి పార్సెల్ చేయమంటారా?” అంటూ జనాన్ని కాస్త ఘాటుగా భయపెట్టడానికి ఒక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయితే ఈసారి ఊరికే హెచ్చరికలతో సరిపెట్టకుండా కాస్త ప్రయోగాత్మకంగా ఉంటుందని భావించి ఏఐ సహాయంతో ఒక సిక్కు సోదరుడి చిత్రాన్ని గీశారు. దానికి ముద్దుగా ‘మిస్టర్ సింగ్’ అని పేరు పెట్టి అమెరికా రోడ్లను వదిలి వెంటనే వెళ్ళిపోవాలంటూ సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రకటనను వదిలారు. ప్రచారం హోరెత్తించి అక్రమ వలసదారుల్లో వణుకు పుట్టిద్దామని భావించిన అధికారులకు.. ఆ ఐడియా తిరిగి సొంత నెత్తినే గొడుగులా చుట్టుకుంటుందని బహుశా ముందే ఊహించి ఉండరు.

ఆ ప్రకటన బయటకు రావడమే ఆలస్యం.. అమెరికాలోని భారతీయ సమాజం, ముఖ్యంగా సిక్కు సోదరులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ఎంతో గర్వంగా, గౌరవంగా తమ పేరు చివర తగించుకునే ‘సింగ్’ అనే ఇంటిపేరును తెచ్చి అక్రమ వలసలు, నిబంధనల ఉల్లంఘనలతో ముడిపెట్టడం వెనుక ఉన్న తెలివితేటలను గట్టిగానే ప్రశ్నించారు. “అక్రమ వలసలను అరికట్టడం మీ ప్రభుత్వ విధానమైతే మాకేమీ అభ్యంతరం లేదు కానీ ఒక నిర్దిష్ట సమాజానికి చెందిన పవిత్రమైన ఇంటిపేరును బ్రాండింగ్ చేసి నేరస్తుల్లా చిత్రీకరించడం ఏ రకమైన న్యాయం?” అంటూ సోషల్ మీడియాలో అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగానికి మామూలు క్లాస్ పీకలేదు. హాలీవుడ్ విలన్ రేంజ్‌లో బిల్డప్ ఇస్తూ “వెళ్ళిపోండి.. లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయి” అని బెదిరింపు ధోరణిలో వాడిన పదజాలం మరింత మంట పుట్టించింది. పైగా సరిగ్గా 9/11 దాడుల వార్షికోత్సవ సమయంలోనే ఈ రకమైన వివాదాస్పద పోస్టర్‌ను వదలి గతంలో సిక్కులు ఎదుర్కొన్న రకరకాల జాతి వివక్షలను, చేదు జ్ఞాపకాలను మళ్ళీ గుర్తుచేశారంటూ భారతీయ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి.

భారతీయులు, సిక్కు సంఘాల నుండి వస్తున్న ఆగ్రహజ్వాలలను, సోషల్ మీడియా ట్రోలింగ్‌ను తట్టుకోలేక అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం అధికారులకు రాత్రికి రాత్రే జ్ఞానోదయం అయింది. ఎలాంటి హడావుడి లేకుండా గప్‌చుప్‌గా ఆ వివాదాస్పద ‘మిస్టర్ సింగ్’ పోస్టును తమ అధికారిక ఖాతాల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. అయితే పోస్ట్ డిలీట్ చేసినంత మాత్రాన వివాదం చల్లారలేదు. అక్రమ వలసలను నిరోధించడం కోసం ప్రభుత్వాలు ఇలా ఐడెంటిటీని, మతాన్ని, వర్ణాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రచారాలు చేయడం ఎంతవరకు సమంజసమనే చర్చ తీవ్రంగా నడుస్తోంది.

ఏది ఏమైనా ప్రచారం పేరిట ఏదో ఒక జాతి లేదా సమాజంపై ముద్ర వేసే ఇటువంటి ‘పై ప్రయోగాలను’ పక్కన పెట్టి, ఇప్పటికైనా అమెరికా అధికారులు కాస్త లౌక్యమైన, కామన్ సెన్స్ ఉన్న పబ్లిక్ రిలేషన్స్ టీమ్‌ను నియమించుకుంటే మంచిది. లేదంటే ఇటువంటి విపరీతమైన క్రియేటివిటీ వల్ల ఉన్న గౌరవం కాస్తా ఊడిపోవడం ఖాయం.

## ఇకపై యూపీఐ చెల్లింపుకు కెమెరా, స్కాన్ అవసరం లేదు




ఇండియాలో డిజిటల్ చెల్లింపులు ఏ స్థాయిలో పెరిగాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. గడచిన ఐదేళ్లలో యూపీఐ పేమెంట్స్ రికార్డ్ స్థాయిలో పెరిగినట్లు స్వయంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. నెలకు 20 బిలియన్‌ల చెల్లింపులు యూపీఐ ద్వారా జరుగుతున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ లెక్కలు చెప్పడం జరిగింది. యూపీఐ చెల్లింపులతో వ్యాపారం పెరగడంతో పాటు, అనేక ఉపయోగాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వృద్ధి సైతం యూపీఐ చెల్లింపుల వల్ల మెరుగుపడుతుందని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం, ఆర్బీఐ యూపీఐ చెల్లింపు విధానంలో ప్రతి ఏడాది విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తుంది. యూపీఐ చెల్లింపుల కోసం పలు కంపెనీలకు అనుమతులు ఇవ్వడం జరిగింది. ఇండియాలో యూపీఐ యాప్ అనగానే ఫోన్ పే, జీ పే, పేటీఎంలు గుర్తుకు వస్తాయి. అలాగే డబ్బులు చెల్లించాలంటే క్యూఆర్ కోడ్, స్కానర్‌లు గుర్తుకు వస్తాయి.

**యూపీఐ చెల్లింపులో కొత్త పద్ధతి...**

ఇక మీదట షాప్‌ల వద్ద క్యూ ఆర్ కోడ్‌లు, ఫోన్‌లో స్కాన్ చేయడం ఏమీ ఉండక పోవచ్చు. యూపీఐ చెల్లింపులు విధానంలో విప్లవాత్మక మార్పు వచ్చింది. ఇది దేశం మొత్తం అందుబాటులోకి రావడానికి పెద్దగా సమయం పట్టకపోవచ్చు. రాబోయే రెండు మూడు ఏళ్లలో షాప్స్, మాల్స్, టిఫిన్ బండ్ల వద్ద కూడా క్యూఆర్ కోడ్‌లు ఉండక పోవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. ఈ స్కాన్ విధానం కంటే మరింత సులువుగా పేమెంట్ చేయడం కోసం ట్యాప్ విధానం తీసుకు వస్తున్నారు. ఇంతకు ముందు కార్డ్ స్వైపింగ్ ఉండేది. కానీ ఇప్పుడు కార్డ్‌లపై సిమ్ ఉంటే, దాన్ని ట్యాప్ చేస్తే చెల్లింపులు అవుతున్నాయి. ఇప్పుడు అదే తరహాలో ఫోన్ పే లేదా మరే యూపీఐ యాప్‌తో అయినా మర్చంట్ వద్ద ఉన్న మిషన్ వద్దకు తీసుకు వెళ్తే ట్యాప్ చేసినట్లు అవుతుంది. దాంతో ఫోన్‌లో మనం చెల్లించాల్సిన మొత్తం, ఇతర వివరాలు కనిపిస్తాయి.

**క్యూఆర్ కోడ్ అవసరం లేకుండా చెల్లింపు...**

ఇప్పటికే కొన్ని షాప్స్, బంక్స్ లో వారే అమౌంట్ ఎంటర్ చేసి క్యూఆర్ ఇస్తారు. ఆ క్యూఆర్ ను స్కాన్ చేసి, అమౌంట్ ఎంటర్ చేయకుండా డైరెక్ట్ పిన్ ఇచ్చేస్తే పేమెంట్ అవుతుంది. అయితే ఇప్పుడు ఆ క్యూఆర్ స్కాన్ కూడా అవసరం లేకుండా, షాప్స్ వారు తమ వద్ద ఉండే ్రూరూ మెషీన్‌లో అమౌంట్‌ను ఎంటర్ చేస్తారు. ఆ ్రూరూ మెషీన్ వద్దకు మన వద్ద ఉన్న చీఖీజ ఉన్న మీ ఫోన్‌ను తీసుకు వెళ్లి ఏదైనా యూపీఐ యాప్ ఓపెన్ చేయగానే మనం చెల్లించాల్సిన అమౌంట్ కనిపిస్తుంది. అప్పుడు వివరాలు సరి చూసుకుని, అమౌంట్ సరైనదేనా, షాప్ వివరాలు కూడా చూసుకుని ఓకే అయితే యాక్సెప్ట్ కొట్టి పిన్ ఎంటర్ చేస్తే చెల్లింపులు పూర్తి అవుతాయి. దీంతో చాలా స్పీడ్‌గా పేమెంట్ అవుతుంది. కొన్ని సార్లు స్కాన్ కాకపోవడం వల్ల వినియోగదారులు ఇబ్బంది పడుతారు. వ్యాపారులు సైతం పదే పదే క్యూఆర్ కోడ్ ను మార్చాల్సి వస్తుంది. కనుక ఇకపై అలా చేయనక్కర్లేదు.

**25 బిలియన్‌ల యూపీఐ చెల్లింపులు..**

ఈ కొత్త పద్ధతి అలవాటు పడటానికి కాస్త సమయం పట్టే అవకాశం ఉంది. చదువుకున్న వారికి ఇది ఉత్తమమైనది, కానీ చదువు లేని వ్యాపారులకు అమౌంట్ ఎంటర్ చేయడం అనేది కాస్త కష్టం కావచ్చు. కనుక ఈ కొత్త పద్ధతి తో పాటు పాత పద్ధతిలో స్కాన్ చేసి చెల్లించే పద్ధతి కూడా కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే డిజిటల్ చెల్లింపులు రికార్డ్ స్థాయిలో నమోదు అవుతు ఉంటే, కొత్త పద్ధతి లో మరింత భారీగా చెల్లింపులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఏడాది చివరి వరకు యూపీఐ చెల్లింపులు 25 బిలియన్‌లకు చేరినా ఆశ్చర్యం లేదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం యూపీఐ చెల్లింపు యాప్స్ కి ఎక్కువగా అనుమతులు ఇవ్వడం ద్వారా మరింత వ్యాపారం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

# ఆస్తి హక్కుల వాస్తవాలు : పిత్రార్జితం VS స్వార్జిత ఆస్తులపై చట్టం ఏం చెబుతోంది?



తల్లిదండ్రుల ఆస్తులపై పిల్లలకు ఉండే హక్కులపై చాలామందికి అపోహలు ఉంటాయి. “తల్లిదండ్రుల ఆస్తి ఏదైనా సరే.. పుట్టుకతో తమకు సమాన వాటా వస్తుంది” అని చాలామంది నమ్ముతుంటారు. అయితే, మన దేశ చట్టాల ప్రకారం ప్రతి ఆస్తికి ఒక స్పష్టమైన స్వభావం ఉంటుంది. ఆస్తి పిత్రార్జితమా (పూర్వీకులదా) లేక స్వార్జితమా (సొంత కష్టార్జితమా) అనే దానిపైనే పిల్లల హక్కులు ఆధారపడి ఉంటాయని పరిశీలకులు చెబుతుననారు.స్వార్జిత ఆస్తులు అంటే ఒక వ్యక్తి తన స్వంత ఉద్యోగం, వ్యాపారం లేదా వ్యక్తిగత సంపాదనతో కొనుగోలు చేసిన ఇల్లు, స్థలాలు లేదా ఇతర ఆస్తులు. తండ్రి లేదా తల్లి బతికుండగా వారి స్వార్జిత ఆస్తిలో కొడుకు, కూతురు ఎలాంటి వాటాను చట్టబద్ధంగా డిమాండ్ చేయలేరని చెబుతున్నారు. స్వార్జిత ఆస్తిని ఎవరికైనా గిఫ్ట్ ఇవ్వాలన్నా, అమ్మేయాలన్నా, లేదా ఇతరులకు వీలునామా రాసివ్వాలన్నా యజమానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని మన చట్టాలు చెబుతున్నాయి. దీనికి పిల్లల అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని, ఒకవేళ యజమాని ఎలాంటి వీలునామా రాయకుండా మరణిస్తే మాత్రం, హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆ స్వార్జిత ఆస్తిలో భార్య, పిల్లలు, తల్లి అందరూ సమాన వాటాలు పొందుతారని నిపుణులు చెబుతున్నారు.

మరోవైపు, పిత్రార్జితం లేదా పూర్వీకుల ఆస్తులు అంటే తండ్రి, తాత, ముత్తాతల నుంచి వంశపారంపర్యంగా వస్తున్న ఆస్తి. ఈ ఆస్తి ఎక్కడా నాలుగు తరాల మధ్య విభజన జరిగి ఉండకూడదని, హిందూ అవిభాజ్య కుటుంబం కింద జన్మించే ప్రతి బిడ్డకు చట్ట సవరణ ప్రకారం కుమార్తెలకు కూడా సమానంగా ఈ ఆస్తిపై పుట్టుకతోనే హక్కు లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, పిత్రార్జిత ఆస్తులను విక్రయించాలన్నా లేదా ఇతరులకు బదిలీ చేయాలన్నా కుటుంబంలోని సహ–వారసులందరి అనుమతి తప్పనిసరి అంటున్నారు. కేవలం తండ్రి ఇష్టానుసారం ఈ ఆస్తులను ఇతరులకు రాసివ్వడానికి కుదరదని స్పష్టం చేస్తున్నారు.

చట్టపరమైన ముఖ్యమైన అంశాలను పరిశీలిస్తే, ఒక వ్యక్తికి తన తండ్రి నుంచి ఆస్తి వచ్చినంత మాత్రాన అది వెంటనే అతని పిల్లలకు పిత్రార్జితం అయిపోదని కూడా చెబుతున్నారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం అది కొందరి విషయంలో స్వార్జిత ఆస్తిగా కూడా పరిగణించబడుతుందని అంటున్నారు. అలాగే కోడలికి నేరుగా అత్తమామల స్వార్జిత ఆస్తులపై ఎలాంటి హక్కు ఉండదని, ఆమె భర్త ద్వారా మాత్రమే ఆస్తిలో చట్టపరమైన ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. అంతేతప్ప స్వయంగా కోడలు కోర్టులో వాటా అడగలేదని చెబుతున్నారు.ఇక పిల్లలకు రాసిచ్చిన ఆస్తులను కూడా తల్లిదండ్రులు వెనక్కి తీసుకునే అవకాశం చట్టంలో ఉంది. తల్లిదండ్రుల బాగోగులు చూసుకోకుండా వేధించే సందర్భాల్లో ‘సీనియర్ సిటిజన్స్ యాక్ట్’ ప్రకారం గిఫ్ట్ డీడ్‌లను రద్దు చేసుకునే అధికారాన్ని చట్టం కల్పించింది. ఆస్తి వివాదాలు కేవలం భావోద్వేగాలతో పరిష్కారం కావు. ఆ ఆస్తి ఎవరి ద్వారా, ఎలా సంక్రమించింది, యజమాని వీలునామా రాశారా లేదా అనే అంశాలను బట్టే న్యాయస్థానాలు తీర్పులు ఇస్తాయని అంటున్నారు. ఈ చట్టపరమైన స్పష్టతను తెలుసుకోవడం ద్వారా అనవసరమైన కుటుంబ తగాదాలను నివారించవచ్చునని అంటున్నారు.

# చిన్నశ్రీను పార్టీ మారతారని బొత్సకు ముందే తెలుసా?!



విజయనగరం జడ్పీ చైర్మన్, తన మేనల్లుడు చిన్న శ్రీను పార్టీ మార్పుపై సీనియర్ నేత, మండలి విపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చిన్న శ్రీను వ్యవహారంపై తనకు చాలా కాలంగా అనుమానం ఉందని బొత్స చెప్పడంపై విస్తృత చర్చ జరుగుతోంది. తన నియోజకవర్గంలో తాను చెప్పినట్లు కూడా పనులు జరగలేదని బొత్స ఆవేదన వ్యక్తం చేయడం కూడా సంచలనంగా మారింది. చిన్న శ్రీను పార్టీ మారిన అనంతరం బొత్స గురువారం సొంత నియోజకవర్గమైన చీపురుపల్లిలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను విషయమై సీనియర్ నేత పలు ఆసక్తికర సమాచారాన్ని వెల్లడించారు.విజయనగరం జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను టీడీపీలో చేరడం అత్యంత రహస్యంగా సాగిందన్న ప్రచారం బొత్స వ్యాఖ్యలతో మరో మలుపు తిరిగినట్లుగా భావిస్తున్నారు. చిన్న శ్రీను పార్టీలో ఉన్నప్పటికీ తనకు వ్యతిరేకంగా స్వతంత్రంగా నడుచుకోవడాన్ని బొత్స 8 నెలల క్రితమే గ్రహించినట్లు స్పష్టం చేశారు. ఈ విషయమై అవగాహన వచ్చిన తర్వాత చిన్న శ్రీనుతో ఎదురవబోయే సవాల్ ను తట్టుకోడానికి కుమార్తెను రంగంలోకి దింపినట్లు ఆయన వెల్లడించారు. దీంతో బొత్స కుటుంబంలో అంతర్గతంగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను సీనియర్ నేత స్వయంగా బయటపెట్టినట్లైందని అంటున్నారు.

బొత్స చెప్పిన ప్రకారం ఆయన కుమార్తె అనూషను జడ్పీ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించడంపై సిట్టింగ్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను నొచ్చుకున్నారని జరిగిన ప్రచారం కరెక్టు కాదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలు ఆశించి చిన్న శ్రీను చాలా కాలంగా పార్టీ మార్పుపై వ్యూహాత్మకంగా అడుగులు వేశారని బొత్స వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. అయితే చిన్న శ్రీను మాత్రం తాను కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితుడినయ్యే పార్టీ మారానని చెప్పడం విశేషమంటున్నారు.

మరోవైపు కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో చిన్న శ్రీనును ముందుగా టీడీపీలోకి పంపి, తర్వాత బొత్స కుటుంబ సభ్యులు కూడా ఆ పార్టీలో చేరతారని జరుగుతున్న ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టారు. తమకు పార్టీ మారే ఉద్దేశం ఏదీ లేదని బొత్స కుమార్తె అనూష స్పష్టం చేశారు. అంతేకాకుండా ఇప్పటివరకు చీపురుపల్లి నియోజకవర్గ బాధ్యతలను చిన్న శ్రీనుకు అప్పగించి చేసిన పొరపాటును మళ్లీ పునరావృతం చేయకూడదని బొత్స భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎవరి జోక్యం లేకుండా ఇక నుంచి తాను స్వయంగా చీపురుపల్లి వ్యవహారాలను పర్యవేక్షిస్తానని బొత్స చెప్పుకొచ్చారు. దీంతో చిన్న శ్రీను పార్టీ మారిన తర్వాత వైసీపీలో పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. ముఖ్యంగా జిల్లా పార్టీ వ్యవహారాలపై బొత్స మరింత యాక్టివ్ అవడం ఆ పార్టీకి సానుకూలంగా మారుతుందా? అనేది చూడాల్సివుందని అంటున్నారు.

# విదేశీ ఐటీ బాబులకు ‘అమెరికా ఆఫర్’.. ఊడితే ఉద్యోగం కాదు.. డైరెక్ట్ ఊరే..



అమెరికా డ్రీమ్.. కలల ప్రపంచం.. అక్కడ డాలర్లు సంపాదించడం.. వారాంతాల్లో వీకెండ్ పార్టీలు చేసుకోవడం చూసి స్వదేశంలో ఉన్నవాళ్లు కుళ్ళుకోవడం సహజమే. కానీ అదే అమెరికాలో ఉద్యోగం ఊడితే పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసా? ఇన్నాళ్లూ ఉద్యోగం పోయినా “పర్లేదులే బాస్.. ఇంకో 60 రోజులు టైమ్ ఉందిగా” అని రిలాక్స్ అవుతూ కొత్త ఉద్యోగం వెతుక్కునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు మన ఆంకిల్ సామ్ అయిన అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్) కి ఏమనుకుందో ఏమో గానీ ఆ 60 రోజుల వెసులుబాటును కూడా లాగేసుకోవాలని చూస్తోంది.

**60 రోజులా? అంత సీన్ లేదు పోండి!**

డీహెచ్‌ఎస్ వారు తీసుకొచ్చిన కొత్త ప్రతిపాదన ప్రకారం.. “మీ ఉద్యోగం పోయిందా? అయితే తట్టాబుట్టా సర్దుకుని తక్షణమే మొదటి విమానం ఎక్కేయండి” అని స్పష్టంగా చెప్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న 60 రోజుల గ్రేస్ పీరియడ్ అంటే అమెరికా పెద్దలకు విపరీతమైన కోపం వచ్చినట్లుంది. ఉద్యోగం పోయిన మరుసటి క్షణమే మీ దగ్గర వేరే ఉద్యోగం లేకపోయినా లేదా లీగల్‌గా ఉండటానికి వేరే దారి లేకపోయినా.. ఇక అక్కడ క్షణం కూడా నిలబడటానికి వీల్లేదు.

**ప్రభావం ఎవరి మీద? ఇంకెవరి మీద మనోళ్ల మీదే**

ఈ దెబ్బ ముఖ్యంగా హెచ్1బీ, ఎల్–1, ఓ–1, టీఎన్ లాంటి వీసాలపై ఉన్న విదేశీ ఉద్యోగులకు.. వారిపై ఆధారపడి ఉన్న ఏ పాపం ఎరగని డిపెండెంట్లపై పడనుంది. అమెరికా టెక్ ప్రపంచంలో మన భారతీయులు, ముఖ్యంగా ఐటీ బాబులు ఎంత బిజీగా ఉంటారో తెలిసిందే. అకస్మాత్తుగా కంపెనీ లేఆఫ్ ప్రకటిస్తే.. “అయ్యో నా కారు ఈఎంఐ, ఇంటి అద్దె పరిస్థితి ఏంటి?” అని ఆలోచించే లోపే ఎయిర్‌పోర్ట్ బాట పట్టాల్సిన పరిస్థితి రాబోతోంది. ఇన్నాళ్లూ ఉద్యోగం పోతే కొత్త ప్రాజెక్ట్ వెతుక్కోవడానికి రెజ్యూమేలు పంపడానికి కనీసం సామాన్లు సర్దుకోవడానికి సమయం ఉండేది. ఇప్పుడు ఆ టైమ్ కూడా ఉండదు. ఉద్యోగం ఊడిన తెల్లారే బ్యాగులు ప్యాక్ చేసుకోవడమే!

**ఇంకా ప్రతిపాదనే సుమా.. కంగారు పడకండి**

అయితే ఐటీ మిత్రులారా.. కొద్దిగా ఊపిరి తీసుకోండి. ఇది ఇప్పటికప్పుడు అమల్లోకి వచ్చేసిన నిబంధన కాదు. కేవలం డీహెచ్‌ఎస్ ముద్దుగా పంపిన ఒక ప్రతిపాదన మాత్రమే. ఇది తుది నిబంధనగా మారాలంటే అమెరికా ప్రభుత్వ పెద్దల ఆమోదం, పబ్లిక్ కామెంట్లు, సుదీర్ఘమైన లీగల్ డ్రామాలు ఇంకా బాకీ ఉన్నాయి. అప్పటివరకు ఈ 60 రోజుల గ్రేస్ పీరియడ్ పదిలంగానే ఉంటుంది. కాబట్టి ప్రస్తుతానికి ప్రశాంతంగా ఉండండి.. కానీ ఎందుకైనా మంచిది మీ బ్యాగులను మాత్రం సర్దుకుని సిద్ధంగా ఉంచుకోవడం ఉత్తమం..


# ప్రత్యామ్నాయ ఇంధనాల జోరు

ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఆగస్టు మొత్తం వాహన నమోదులు గత ఏడాదితో పోలిస్తే 17.5 శాతం పెరిగి, ఆ నెలకు ఇప్పటివరకు నమోదైన అత్యధిక అమ్మకాల స్థాయిని చేరుకున్నాయి. అంతేకాదు, తొలిసారిగా సీఎన్‌జీ, విద్యుత్, హైబ్రిడ్‌వంటి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు ప్యాసింజర్ వాహన విక్రయాల్లో ముందంజలో నిలిచాయి. ఇది భారత వాహన మార్కెట్‌లో చారిత్రక మలుపుగానే చెప్పుకున్నా.. ఈ గణాంకాలను నిశితంగా పరిశీలిస్తే కొన్ని జాగ్రత్తలు అవసరమయ్యే అంశాలు కనిపిస్తాయి. మొదటగా, జూలై 2026 నెల కూడా బలమైన అమ్మకాలతో నిలవగా, ఆగస్టు గణాంకాలు దానికంటే 6.4 శాతం తక్కువగా నమోదయ్యాయి. దీనికి వర్షాకాలం కారణం కావచ్చు. అంటే ఆగస్టు గణాంకాలను వార్షిక వృద్ధి కోణంలో మాత్రమే కాకుండా, నెలవారీ ధోరణితోనూ బేరీజు వేయాల్సిన అవసరముంది. రెండోది, గ్రామీణ ప్రాంతాల్లో వాహన రిటైల్ విక్రయాలు 19.7 శాతం పెరగ్గా, పట్టణ ప్రాంతాల్లో ఈ వృద్ధి 15.1 శాతానికే పరిమితమైంది. ప్యాసింజర్ వాహనాల విషయంలోనూ ఇదే ధోరణి. గ్రామీణ ప్రాంతాల్లో 24.9 శాతం వృద్ధి నమోదవగా, పట్టణ ప్రాంతాల్లో 10.9 శాతానికే పరిమితమైంది. పెరుగుతున్న గ్రామీణ ఆదాయాలు, పాక్షిక-పట్టణ మౌలిక వసతులపై రాష్ట్ర ప్రభుత్వాల నిరంతర మూలధన వ్యయమే దీనికి కారణం కావచ్చు. అయితే, ట్రాక్టర్ల అమ్మకాలు గతంలో వర్షాకాల సంబంధిత గ్రామీణ ఒత్తిడిని సూచించేవి. ఏడాది ప్రాతిపదికన వాటి అమ్మకాల్లో పెద్దగా మార్పులేకున్నా, నెలవారీగా చూస్తే 25 శాతం క్షీణించాయి. ద్విచక్ర వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు మాత్రం బాగా అమ్ముడవుతుండటాన్ని పరిగణనలోకి తీసుకుంటే, వ్యవసాయ మూలధన వ్యయంకంటే వ్యవసాయేతర గ్రామీణ ఆదాయాలు, గ్రామీణ చలనశీలత (మొబిలిటీ) మరింత బలపడుతున్నట్టు ఈ ధోరణి సూచిస్తోంది. అంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా, ఇతర ఆదాయ మార్గాల ద్వారా కూడా బలపడుతున్నట్టు స్పష్టమవుతోంది. మూడోది, గత ఏడాది జీఎస్‌టీ మండలి చిన్న కార్లు, మోటార్‌సైకిళ్లు (350 సీసీ వరకు), త్రిచక్ర వాహనాలు, బస్సులు, గూడ్స్ వాహనాలపై పన్నులు తగ్గించింది. కొత్త రేట్ల కోసం కొనుగోలుదారులు ఎదురుచూడటంతో ఆగస్టు 2025లో అమ్మకాల వృద్ధి తగ్గింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 2026 గణాంకాలను పోల్చుకునేటప్పుడు, గత ఏడాది తక్కువ ఆధారస్థాయి (బేస్ ఎఫెక్ట్) ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. నాలుగోది, సీఎన్‌జీ, హైబ్రిడ్, విద్యుత్ ఇంధన వాహనాలు పెట్రోల్/ ఇథనాల్ వాహన అమ్మకాలను 1.1 శాతం పాయింట్ల తేడాతో అధిగమించినప్పటికీ, చాలా హైబ్రిడ్ వాహనాలు ఇప్పటికీ పెట్రోల్‌నే వినియోగిస్తుండగా, సీఎన్‌జీ కూడా ఒక శిలాజ ఇంధనమే. కాబట్టి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు ముందంజలో ఉండటమంటే శిలాజేతర ఇంధన వాహనాలు ముందంజలో ఉన్నాయని అర్థం కాదు. ఇది గమనించాలి.

నిజానికి, పెట్రోల్ వాహనాలు వెనుకబడటం గమనించదగ్గ అంశమే. ఆగస్టు 2024, ఆగస్టు 2026 మధ్య కాలంలో సీఎన్‌జీ, విద్యుత్ ఇంధన వాహనాలే ఈ పెరుగుదలకు ప్రధాన కారణమన్నది గణాంకాల సూచన. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, కొంతమేర ఇథనాల్ మిశ్రమంపై ఆందోళనల నేపథ్యంలో నడపడానికి చౌకైన ప్రత్యామ్నాయాల వైపు భారతీయులు మళ్లుతున్నారని ఇది సూచిస్తోంది. అంతర్జాతీయ ఇంధన ధరల అస్థిరత సాధారణ వినియోగదారుల కొనుగోలు నిర్ణయాలను కూడా ప్రభావితం చేస్తున్నదనేందుకు ఇదొక నిదర్శనం. పెట్రోల్ నుంచి ఈ మళ్లింపు అన్ని విభాగాల్లో ఒకేలా లేదు. త్రిచక్ర వాహనాల్లో ఎక్కువ భాగం ఇప్పటికే విద్యుత్‌పై నడుస్తుండగా, ద్విచక్ర వాహనాలు ఇంకా ఆ స్థాయిని అందుకుంటున్నాయి, ప్యాసింజర్ కార్ల ఇంధన వ్యవస్థలు మరింత వైవిధ్యభరితం అవుతూనే ఉన్నాయి. ఈ మూడు విభాగాల మధ్య వ్యత్యాసం, విద్యుదీకరణ ప్రక్రియ ఏకరీతిన కాకుండా, ఒక్కో వాహన కేటగిరీలో దాని స్వంత వేగంతో ముందుకు సాగుతున్నదని తెలియజేస్తుంది. విద్యుదీకరణ అనేది పారిశ్రామిక విధానానికి తోడు, పెరుగుతున్న వినియోగదారుల డిమాండ్‌కు కూడా అద్దం పడుతోంది. అంటే ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు, సాధారణ కొనుగోలుదారుల ఆచరణాత్మక, ఆర్థిక ఆలోచనలదీ ఈ మార్పులో కీలక పాత్ర. చివరగా, రికార్డుస్థాయి అమ్మకాలు నమోదైనప్పటికీ, డీలర్లు సిఫారసు చేసిన 21 రోజుల నిల్వకు బదులు 38-40 రోజుల నిల్వను కలిగి ఉన్నట్టు ఫాడా నివేదించింది. ఇది కొంత ఆందోళనకరమైన అంశం. డీలర్ల వద్ద నిల్వలు అధికంగా ఉండటం అంటే, రిటైల్ డిమాండ్‌కు, హోల్‌సేల్ సరఫరాకు మధ్య అంతరముందని సూచిస్తుంది. అంటే పెట్రోల్ శకం ఇంకా ముగియకున్నా, భారత వాహన పరిశ్రమ ప్రత్యామ్నాయ ఇంధన వాహనాల భారీస్థాయి మార్కెట్ ఏకీకరణను ప్రారంభించిందని చెప్పవచ్చు.

అయితే, ఆధార ప్రభావం (బేస్ ఎఫెక్ట్) సమసిపోయిన తర్వాత కూడా సెప్టెంబర్-నవంబర్ కాలంలో ప్రత్యామ్నాయ ఇంధన వాహనాల్లో సాధించిన లాభాలు కొనసాగితేనే, డీలర్ల నిల్వలు సాధారణ స్థాయికి చేరుకుంటేనే ఆగస్టు 2026ను ఒక నిజమైన చారిత్రక మలుపుగా పరిగణించడానికి వీలవుతుంది. ఈలోగా, ఈ గణాంకాలు భారత వాహన మార్కెట్‌లో ఒక ముఖ్యమైన నిర్మాణాత్మక మార్పుకు సంకేతంగా నిలుస్తున్నాయనడంలో సందేహం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న కొనుగోలు శక్తి, ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు వినియోగదారుల మొగ్గు, ప్రభుత్వ విధానాల మద్దతు కలగలిసి ఈ రంగంలో దీర్ఘకాలిక మార్పులకు బాటలు వేస్తున్నాయి. ఇది కేవలం ఒక తాత్కాలిక ధోరణి కాకుండా, రాబోయే కాలంలో భారత వాహన పరిశ్రమ స్వరూపాన్నే మార్చే అవకాశం ఉందన్నది నిపుణుల మాట. అయితే ఇది స్థిరమైన ధోరణిగా మారాలంటే, రుతుపవనాల ప్రభావం, పన్ను విధానాల మార్పులు వంటి తాత్కాలిక అంశాల ప్రభావాన్ని మినహాయించి, రాబోయే నెలల్లో ఈ వృద్ధి కొనసాగుతుందా లేదా అన్నది నిర్ధారించుకోవడం అవసరం. ముఖ్యంగా, డీలర్ల వద్ద పేరుకున్న అధిక నిల్వలను తగ్గించుకోవడం, వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని సర్దుబాటు చేసుకోవడం పరిశ్రమ ముందున్న సవాళ్లు. మొత్తానికి, భారత వాహన పరిశ్రమ ఒక కీలక పరివర్తన దశలో ఉందని, ఈ మార్పు నిలకడగా కొనసాగితే భవిష్యత్తులో దేశ ఇంధన భద్రత, దిగుమతుల భారం తగ్గింపు, పర్యావరణ లక్ష్యాలకు కూడా ఇది గణనీయంగా దోహదపడుతుందని చెప్పొచ్చు. వచ్చే కొద్ది నెలల గణాంకాలే ఈ ధోరణి శాశ్వతమా? తాత్కాలికమా? అన్నది స్పష్టం చేయనున్నాయి.

## పనికొచ్చే పలుకు



# వర్తమానమే నిజమైన సంపద

చాలామంది ఒక విచిత్రమైన మానసిక వలలో చిక్కుకుని -గతంలో జీవిస్తుంటారు. "అప్పుడు అలా చేసి ఉంటే బాగుండేది" అనేది వీళ్లనుంచి వినిపించే రొటీన్ కంప్లైంట్. వీళ్లకు భిన్నంగా మరోవర్గమూ ఉంది. వాళ్లు -భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతూ, "రేపేమవుతుందో" అన్న భయంతో బతుకుతుంటారు. ఈ రెండు ధోరణులూ -వాళ్లకు వర్తమానాన్ని దూరం చేస్తున్నాయి. నిజమేమిటంటే.. మనిషి జీవించగలిగేది, అనుభవించగలిగేది, మార్చగలిగేది కేవలం వర్తమానాన్నే. గతం జ్ఞాపకం. భవిష్యత్తు ఊహ. వర్తమానమే వాస్తవం. దీన్ని గుర్తిస్తే జీవనశైలి మార్పుకు తొలి అడుగు.

మానసిక ఆరోగ్య నిపుణులు చెప్పే మైండ్‌ఫుల్‌నెస్ (సచేతనత) సూత్రం కూడా. ప్రస్తుత క్షణంపై పూర్తి దృష్టి కేంద్రీకరించడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది, మానసిక స్థిరత్వం పెరుగుతుందని. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకు, ప్రతి పనినీ పూర్తి శ్రద్ధతో, ఆసక్తితో చేయడం అలవాటు చేసుకుంటే, ఆ పని ఎంత చిన్నదైనా అందులో ప్రత్యేకమైన తృప్తి లభిస్తుంది. ఉదాహరణకు, పొద్దున్నే తాగే ఒక కప్పు గ్రీన్ టీని తొందరగా ముగించేయాలన్న ఆతృతతో కాకుండా, వాసననీ, రుచినీ ఆస్వాదిస్తూ తాగితే, చిన్న క్షణం గొప్ప అనుభవమవుతుంది. ఇదే సూత్రాన్ని పనిలో, బంధాల్లో, రోజువారీ కార్యకలాపాల్లో అన్వయిస్తే, బతుకులో -నాణ్యత పెరుగుతుంది.

వర్తమానంలో జీవించడం అంటే భవిష్యత్తు గురించి ఆలోచించకూడదని కాదు, ప్రణాళికలు వేసుకోకూడదనీ కాదు. ప్రణాళిక వేసుకోవడం అవసరమే, కానీ ఆ ప్రణాళిక కోసం ఇప్పటి ఆనందాన్ని బలి చేయకూడదు. "రేపు విజయం సాధిస్తే అప్పుడు సంతోషిస్తాను" అనుకునే ధోరణి మనుషులను శాశ్వతంగా అసంతృప్తిలో ఉంచుతుంది. ఎందుకంటే ఒక లక్ష్యాన్ని చేరుకోగానే మరో లక్ష్యం ముందుకొస్తుంది. అప్పుడు ఆనందం ఎప్పటికీ వాయిదా పడుతూనే ఉంటుంది. దీనికి బదులు, లక్ష్యంవైపు సాగే ప్రతి అడుగులోనూ చిన్న చిన్న సంతోషాలు వెతుక్కోవాలి. ప్రయాణంలోని ప్రతి క్షణాన్నీ ఆస్వాదించగలగాలి. అదే -నిజమైన సంతృప్తి.

ఈ ఆలోచనా విధానం మనిషి జీవనశైలిని అనేక రకాలుగా మెరుగుపరుస్తుంది. మొదటిగా, ఆరోగ్య పరంగా. గతం గురించిన పశ్చాత్తాపం, భవిష్యత్తు గురించిన ఆందోళన రెండూ మానసిక ఒత్తిడిని పెంచి, రక్తపోటు, నిద్రలేమి వంటి శారీరక సమస్యలకు దారితీస్తాయి. వర్తమానంపై దృష్టి పెట్టడంవల్ల మనసు ప్రశాంతంగా ఉండి, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. రెండోది, సంబంధాల పరంగా. ఎదుటివారితో మాట్లాడేటప్పుడు పూర్తి దృష్టితో వినడం, ఆ క్షణంలో నిజంగా అక్కడ ఉండటం వల్ల బంధాలు మరింత బలపడతాయి. మూడోది, పని సామర్థ్యం పరంగా. ప్రస్తుత పనిపై పూర్తి ఏకాగ్రత పెట్టడంవల్ల నాణ్యమైన ఫలితాలు వస్తాయి, పొరపాట్లు తగ్గుతాయి.

అయితే వర్తమానంలో జీవించడం అంటే గతంనుంచి ఏమీ నేర్చుకోకపోవడం కాదు. గతంలోని అనుభవాలు, తప్పులు మనకు పాఠాలు నేర్పుతాయి. వాటిని ఒక మార్గదర్శిగా తీసుకోవాలి, భారంగా మోయకూడదు. అలాగే భవిష్యత్తు ప్రణాళిక తప్పు కాదు. కానీ ఆ ప్రణాళిక వర్తమానాన్ని నిర్లక్ష్యం చేసేదిగా ఉండకూడదు.

నిజానికి -మనిషికి ప్రతి ఉదయం ఒక కొత్త అవకాశం. దాన్ని ఉత్సాహంగా ప్రారంభించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంది. అదే -మనిషి జీవనశైలిలో గొప్ప పరివర్తనకు నాంది. సంతోషం అనేది భవిష్యత్తులో ఎక్కడో దాగి లేదు. అది ఇప్పుడు, ఇక్కడ, ఈ క్షణంలోనే ఉంది. దీన్ని గుర్తించి, స్వీకరించగలిగినవారే నిజమైన అర్థంలో జీవితాన్ని జయించినవారు.

# సమతుల్య మార్గమే శరణ్యం!




భారత్ ఆతిథ్యమిస్తున్న పదిదేశాల బ్రిక్స్ కూటమి 18వ శిఖరాగ్ర సదస్సు నేడు, రేపు జరగనుంది. ఇది కేవలం దౌత్యపరమైన లాంఛనం కాదు, ప్రపంచ రాజకీయార్థిక వ్యవస్థ గణనీయమైన మలుపు తిరుగుతున్న తరుణంలో జరుగుతున్న కీలక భేటీ. నెల క్రితం జరిగిన బ్రిక్స్ ఆర్థిక మంత్రుల సమావేశం ఎలాంటి ఉమ్మడి ప్రకటన లేకుండానే ముగియడం కూటమిలోని అంతర్గత విభేదాలను స్పష్టం చేసింది. 2024లో రష్యాలో జరిగిన సదస్సులో ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, యూఏఈలూ తొలిసారి సభ్య దేశాలుగా పాల్గొనగా, 2025లో ఇండోనేషియా అధికారికంగా చేరి ఆగ్నేయాసియా నుంచి తొలి సభ్యదేశంగా నిలిచింది. సౌదీ అరేబియా, అర్జెంటీనాలకు ఆహ్వానం అందినప్పటికీ అవి చేరలేదు. ఇదే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొనగా, సరిగ్గా అదే తేదీల్లో అమెరికాలో జీ-20 ఆర్థిక మంత్రుల సమావేశం జరిగింది. అందులో దక్షిణాఫ్రికాకు ఆహ్వానం లభించలేదు. డిసెంబర్ 14-15 తేదీల్లో ఫ్లోరిడాలో జీ-20 శిఖరాగ్ర సదస్సు జరగనున్న నేపథ్యంలో, ఆగస్టునుంచి డిసెంబర్ వరకు వివిధ వేదికలపై పరస్పర భిన్నమైన కథనాలు ఏకకాలంలో ప్రపంచవేదికపై ప్రతిధ్వనించనున్నాయి. ఎస్‌సీవో 25వ వార్షికోత్సవం సందర్భంగా వెలువడిన బిష్కెక్ డిక్లరేషన్ ప్రపంచ రాజకీయాలు ఆర్థిక, సామాజిక, సాంకేతిక రంగాల్లో లోతైన మార్పులకు లోనవుతున్నాయని విశ్లేషించింది. కొనసాగుతున్న యుద్ధాలు, ఇంధన-ఆహార భద్రత సవాళ్లు, మార్కెట్ అస్థిరత, వాతావరణ మార్పుల తీవ్రత అంతర్జాతీయ పరిస్థితిని జటిలం చేశాయని అది పేర్కొంది. ఇదే సవాలు బ్రిక్స్ సదస్సు ముందూ నిలిచి ఉంది. భారత్, చైనా, రష్యా, ఇరాన్‌లు ఎస్‌సీవో, బ్రిక్స్ రెండింటిలోనూ సభ్యదేశాలు. పాకిస్థాన్ చేరికను షరతుగా పెట్టి చైనా ఎస్‌సీవోలో భారత సభ్యత్వాన్ని క్లిష్టతరం చేసినా, బ్రిక్స్‌లో మాత్రం ఇరాన్‌తోపాటు యూఏఈ చేరికకు భారత్ మద్దతిచ్చింది. అయితే గల్ఫ్, పశ్చిమాసియా ప్రాంతంలో పరిస్థితులు అప్పటినుంచి గణనీయంగా మారాయి. 2020లో అబ్రహామ్ ఒప్పందాలపై సంతకం చేసిన యూఏఈని, కొనసాగుతున్న గల్ఫ్ సంక్షోభంలో అమెరికా-ఇజ్రాయెల్ కూటమిలో భాగంగా ఇరాన్ చూస్తోంది.

ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల అనంతరం భారత్ కూడా అదే వైఖరివైపు మొగ్గు చూపినట్టు కనిపించింది. అయితే అమెరికా తన వాణిజ్య ఒప్పందాన్ని నిలిపివేయడం, ఇరాన్-అమెరికా మధ్యవర్తిత్వం ద్వారా పాకిస్థాన్ వ్యూహాత్మక శూన్యతను సొమ్ము చేసుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో భారత్ తన వైఖరిని పునస్సమీక్షించుకుంటోంది. ఇందులో భాగంగానే ఇరాన్‌పై సైనిక దాడులను ఖండిస్తూ, పాలస్తీనా సమస్యను "సమగ్రంగా, న్యాయబద్ధంగా" పరిష్కరించకుండా పశ్చిమాసియాలో శాశ్వత శాంతి సాధ్యం కాదని పేర్కొన్న బిష్కెక్ డిక్లరేషన్‌కు భారత్ మద్దతిచ్చింది. ఇటీవలి కాలంలో ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా విషయమై భారత్ వైఖరి బలహీనపడటం గమనార్హం. రెండు కూటములూ తాము ఏ దేశానికీ వ్యతిరేకం కాదని చెబుతున్నా, ఇరాన్-ఉక్రెయిన్ యుద్ధాలతోపాటు ప్రపంచ రాజకీయ-ఆర్థిక అధికార మార్పిడి జరుగుతున్న దశలో పక్షపాతం అనివార్యమనేది వాస్తవం. తన గ్లోబల్ సౌత్ మద్దతును పటిష్టం చేసుకోవడానికి, ప్రపంచ వాణిజ్య సంస్థ వంటి ప్రస్తుత వ్యవస్థలోని అనుకూలాంశాలను ఎంపిక చేసుకుని కాపాడుకుంటూ, డాలరీకరణ నుంచి బయటపడే ప్రక్రియను వేగవంతం చేస్తూ, అంతర్జాతీయ ఆర్థిక-రాజకీయ వ్యవస్థలో లెక్కకట్టిన సంస్కరణలు సాధించడానికి చైనా రెండు కూటముల ఎజెండాను తన అదుపులో పెట్టుకోవాలని చూస్తోంది. చైనా సంస్కరణవాద ఎజెండాలోని కొన్ని అంశాలతో భారత్ ఏకీభవిస్తున్నా, ఈ కూటములు పాశ్చాత్య వ్యతిరేక వేదికలుగా మారడాన్ని భారత్ నిరోధించే ప్రయత్నం చేస్తుంది. అలీన ఉద్యమం (నామ్) భారీగా విస్తరించి పాశ్చాత్య వ్యతిరేక వాదనలకు వేదికగా మారే పరిస్థితి వచ్చినప్పుడు గతంలో భారత్ ఇదే సమతుల్య పాత్రను పోషించింది. రాబోయే బ్రిక్స్ సదస్సుకు "స్థితిస్థాపకత, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అన్న ఎజెండాను భారత్ ప్రతిపాదించింది. స్థితిస్థాపకత అంటే ప్రపంచ అనిశ్చితులు, వాతావరణ ముప్పులు, సరఫరా వ్యవస్థ అంతరాయాలను ఎదుర్కొనే సామర్థ్యం. ఇందులో రెండు యుద్ధాల వల్ల కలిగిన ఆర్థిక అంతరాయం, ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాలు భాగంగా ఉన్నాయి. బ్రిక్స్ దేశాల జీడీపీ గ్లోబల్ సౌత్ జీడీపీలో మూడింట రెండు వంతులున్నా, అంతర్-బ్రిక్స్ వాణిజ్యం దక్షిణ వాణిజ్యంలో కేవలం 20 శాతమే. చైనాతో భారత్‌కున్న 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఈ అసమతుల్యతకు అద్దం పడుతోంది.

రెండో ఇతివృత్తం ఆవిష్కరణ. డిజిటల్ ప్రజా మౌలిక వసతులు, ఫిన్‌టెక్, కృత్రిమ మేధ రంగాలను కలిగి ఉంది. డిజిటల్ ప్రజా మౌలిక వసతుల్లో భారత్ ముందంజలో ఉండగా, ఏఐ రంగంలో, ప్రత్యేకించి అరుదైన ఖనిజాల సరఫరాలో చైనా ఆధిపత్యం ఉంది. అమెరికాను తన ప్రధాన ప్రత్యర్థిగా చూస్తున్న చైనా, మరో దేశం ఈ రంగంలో ముందంజ వేయడాన్ని ప్రోత్సహించే అవకాశం లేదు. మూడో ఇతివృత్తం సహకారం. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణ, శాశ్వత సభ్యత్వ విస్తరణకు బ్రెజిల్, భారత్, జర్మనీ, జపాన్‌లతో కూడిన జీ-4 గ్రూప్ 21వ శతాబ్దం ఆరంభం నుంచే పని చేస్తున్నా, చైనా, బహిరంగంగా కాకపోయినా రష్యా కూడా దీనికి మద్దతివ్వలేదు. ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ సంస్కరణలపై మాత్రమే సభ్యదేశాలన్నీ ఏకాభిప్రాయానికి వస్తున్నాయి. బ్రిక్స్ ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ కేవలం 100 బిలియన్ డాలర్ల డిపాజిట్లతో తగినంత మూలధనం లేకుండా ఉండగా, దీనికి సమాంతరంగా చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ ద్వారా నిధులు అందిస్తోంది. బిష్కెక్ డిక్లరేషన్‌లో బీఆర్ఐకు మద్దతివ్వకుండా భారత్ దూరంగా ఉండటం గమనార్హం. చివరిగా వాతావరణ మార్పులు నాలుగో ఇతివృత్తంగా చర్చకు రానున్నాయి. ఇరాన్ యుద్ధం సృష్టించిన ఇంధన సంక్షోభం కర్బన అనంతర ప్రపంచం కోసం ప్రణాళిక అవసరాన్ని నొక్కి చెబుతోంది. బ్రిక్స్‌ను "నిర్మాణాత్మక సంవాద వేదిక"గా విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అభివర్ణించగా, ఎస్‌సీవోను "ఆవిర్భవిస్తున్న బహుళధ్రువ ప్రపంచంలో స్వతంత్ర కేంద్రాల్లో ఒకటి"గా పుతిన్ అంతకుముందు అభివర్ణించారు. అదే వర్ణన బ్రిక్స్‌కూ వర్తిస్తుంది. ఢిల్లీలోని చైనా రాయబారి షు ఫీహాంగ్, ప్రపంచ జనాభాలో సగం, ప్రపంచ ఆర్థిక ఉత్పత్తిలో 30శాతం, వాణిజ్యంలో ఐదోవంతు కలిగిన బ్రిక్స్ భవిష్యత్ ప్రపంచ వృద్ధికి "ఇంజిన్"గా నిలవగలదని అభిప్రాయపడ్డారు. అయితే సమస్య ఏమిటంటే, భారత్-చైనా సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, చైనా అధ్యక్షుడితో తన సమావేశాన్ని జీ-2 భేటీగా ట్రంప్ అభివర్ణించడంతో ఉత్సాహం పొందిన చైనా తనను తాను ఆసియాలో ఆధిపత్య శక్తిగా భావిస్తోంది. ఏడేళ్ల తర్వాత అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత్‌ను సందర్శించనున్నారు. ఆయన గత పర్యటన తర్వాతే 2020లో తూర్పు లడఖ్‌లో చైనా సరిహద్దు చొరబాట్లు జరిగాయి. ప్రత్యక్ష విమాన సర్వీసులు, సరిహద్దు వాణిజ్యం పునఃప్రారంభమైనా, రెండు దేశాల మధ్య పరస్పర విశ్వాసం పునరుద్ధరణకు సమయం పట్టనుంది. అస్థిరపడిన ప్రపంచంలో, విభజిత సభ్యత్వంతో బ్రిక్స్‌ను భారత్ విజయవంతంగా నడిపించగలదా? అన్నది న్యూఢిల్లీ డిక్లరేషన్ వెల్లడించనుంది. ■




మీ వద్ద ప్రస్తుతమున్న పరిమిత సామర్థ్యాలతోనే భవిష్యత్ సమస్యలను పరిష్కరించాలని ఆలోచించినపుడే -మనసులో భయం మొదలవుతుంది. కానీ ఒక్క విషయం గుర్తుంచుకోండి. భవిష్యత్తు సవాళ్లు ఎదురయ్యే నాటికి, వాటిని ఎదుర్కొనేందుకు కావాల్సిన అనుభవాన్ని, నైపుణ్యాన్ని, పరిణతిని మీరు కచ్చితంగా సముపార్జించే ఉంటారు. ఈ రోజు అసాధ్యంగా కనిపించేది, రేపటికల్లా మీ సామర్థ్యానికి అందుబాటులోకి వస్తుంది. కాబట్టి రేపటి సమస్యలను ఈరోజు పరిష్కరించాలని తొందరపడకండి. సమయం వచ్చినప్పుడు, తగిన సన్నద్ధతతో మీరే సిద్ధంగా ఉంటారు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# తిండి రాక్షసి!



లండన్‌లోని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రధాన కార్యాలయంలో వృత్తిపరమైన స్పీడ్ ఈటర్ లియా షట్‌కేవర్ 1.35 పౌండ్ల బరిటోను కేవలం 30.75 సెకన్లలో లాగించేసి, మికి సుడో పేరిట ఉన్న 31.47 సెకన్ల రికార్డును బద్దలుకొట్టింది. 2022లో సుడో చేతిలో కోల్పోయిన ఈ టైటిల్‌ను ఇప్పుడు తిరిగి సొంతం చేసుకుంది. యూట్యూబ్ ఫుడ్ ఛాలెంజ్ వీడియోతో అనుకోకుండా ఈ రంగంలోకి అడుగుపెట్టిన లియాకు ఇప్పటికే 42 గిన్నిస్ రికార్డులున్నాయి. ఈసారి ఆమె ఏమాత్రం మిగల్చకుండా బరిటోను క్లీన్‌గా తినేసి, అందరినీ ఆశ్చర్యపరిచింది.

# రాత్రిపూట భయంతో నిద్రపట్టడం లేదా.. వెల్లుల్లితో ప్రతికూల శక్తిని వెళ్లగొట్టండి..!

**రాత్రిసమయాల్లో ఉలిక్కిపడి లేస్తున్నారా.. భయపడి నిద్ర పట్టడం లేదా.. చిన్న అలికిడి అయితే బెంబేలెత్తుతున్నారా..!దిష్టి తగిలింమోనని భయపడుతున్నారా. ఇలాంటి బాధలను కిచెన్? లో ఉండే వెల్లుల్లితో పరిష్కరించవచ్చని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు. వెల్లుల్లితో దిష్టి నివారణ చర్యల గురించి ఈ స్టోరీలో తెలుసుకుందాం. .**



చాలామంది రాత్రి పూట ఉన్నట్టుండి భయపడి లేస్తారు. ఇక వారికి నిద్రపట్టదు. భయ భయంగా గడుపుతుంటారు. ఇక వారికి నిద్ర పట్టదు. చిన్న అలికిడి అయితే బెంబేలెత్తుతారు. ఇంట్లో పెద్దలు ఉంటే దిష్టి తగిలిందేమో.. దిష్టి తీయండంటూ ..ఇరుగుదిష్టి.. పొరుగుదిష్టి.. నీ దిష్టి.. నా దిష్టి.. ఊళ్లో వాళ్లందరి దిష్టీ పోవాలి.. తు తు తు!! అంటూ దిష్టి తీస్తారు. ఇంట్లో ప్రతికూల శక్తి తాండవిస్తుంటే ఇలాంటి ఘటనలు జరుగుతాయి. వెల్లుల్లితో ప్రతికూల శక్తిని తొలగించవచ్చని పండితులు చెబుతున్నారు. మనం దిష్టి ప్రభావంలో ఉన్నప్పుడు లేదా దేనికైనా భయపడినప్పుడు, తరచుగా రాత్రిపూట హఠాత్తుగా మేల్కొంటాము. ఆ తర్వాత, తిరిగి నిద్రపోవడం చాలా కష్టంగా ఉంటుంది. దీనికి కారణం పీడకలలు కావచ్చు, అవి మనల్ని ఎంతగానో కలవరపెడతాయి, దానివల్ల మనం సరిగ్గా నిద్రపోలేక, నిరంతరం ఏదో ఒక దాని గురించి ఆలోచిస్తూ ఉంటాము.
సాధరణంగా వెల్లుల్లిని రెసీపీల్లో కమ్మని వాసన... రుచికి వాడతారు. ఆయుర్వేదంలో కొన్ని ఔషధాల తయారీలో కూడా వాడుతారు. అంతేకాదు ఆధ్యాత్మికంగా కొన్ని ప్రతికూల శక్తులను తొలగిస్తుందని పండితులు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో భయపడుతూ.. నిద్ర లేచి .. ఇక నిద్రపట్టకపోతే ఆ ఇంట్లో ప్రతికూల శక్తి ఉందని పెద్దలు చెబుతారు. అలాంటి వాటిని వెలల్లితో తొలగిస్తారు.
వెల్లుల్లితో భయం తొలగించే విధానం రెండు వెల్లుల్లి రెబ్బలను పొట్టు తీయాలి. వాటిని వాసన చూస్తూ దిండు కింద పెట్టి పడుకోవాలి. వెల్లుల్లికి ఉండే ఘాటైన వాసన వలన ప్రతికూల శక్తి ఆ ప్రాంతంలోకి రాదు.. అప్పటికే ఉంటే అక్కడి నుంచి వెళుతుంది. అలా దిండుకింద ఉంచిన వెల్లుల్లి రెబ్బలను రాత్రంతా దిండుకింద అలానే ఉంచాలి. పొద్దున్నే తెల్లవారిన తరువాత.. దంతాలను శుద్ధి చేసుకున్న తరువాత ఒక పాత్రలో నీళ్లు తీసుకొని అందులో ఈ రెండు వెల్లుల్లి రెబ్బలు వేయాలి. స్నానం చేసిన తరువాత ఆ నీటిలో చిటికెడు పసుపు కలిపి వేపచెట్టు కాని.. రావి చెట్టు కాని.. లేదా ఏదైనా పచ్చని చెట్టు మొదట్లో పోయాలి. ఇలా కొంతకాలం చేస్తే రాత్రి పూట నిద్రలో వచ్చే చెడు ..భయంకర కలలు రావని చెబుతున్నారు. దిష్టి వలన భయము తొలగి.. నిద్రలో ఉలిక్కిపడి లేవకుండా ఎంతో చక్కగా నిద్రపోయేందుకే అవకాశం ఉందని పండితులు చెబుతున్నారు.

## కిచెన్ క్లీన్‌గా.. ఆరోగ్యం సేఫ్‌గా: వంటగదిని బ్యాక్టీరియా ఫ్రీగా మార్చేయండి ఇలా!



వంటగది క్లీన్ గా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఫుడ్ తినడమే కాదు ఆ ఫుడ్ ని వండే కిచెన్ ని కూడా మంచిగా ఉంచుకోవాలన్నమాట. కిచెన్ ని క్లీన్ గా ఉంచడానికి ఈ టిప్స్ పాటిస్తే హెల్తీగా, హ్యాపీగా ఉంటారు. ఉదయాన్నే స్నానం చేసి లేదా కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కున్న తర్వాతనే వంటగదిలోకి వెళ్లాలి. ఇది అలవాటుగా మారితే చాలా అనారోగ్య సమస్యలను దూరం చేసుకున్నట్లే. స్టవ్ చుట్టూ క్లీన్ గా ఉండేలా చూసుకోవాలి. స్టవ్ మీద ఉండే మరకలను ఎప్పటికప్పుడు తుడిచి, శుభ్రం చేయాలి. వాటిని అలా వదిలేస్తే బాక్టీరియా పెరుగుతుంది. అది వండే వాటిలోకి చేరుతుంది. వంటచేసే చోట ఒక్కసారి వెనిగర్ చల్లి తుడిస్తే బాక్టీరియా చనిపోతుంది.
వంటగదిలోకి గాలి, వెలుతురు వచ్చేలా చూసుకోవాలి. కిటికీలను తెరిచిన తర్వాత వంట మొదలుపెట్టాలి. కిచెన్ ని క్లీన్ చేసేందుకు వాడే కెమికల్ ని ఆహార పదార్థాలు, వంట దినుసులకు దూరంగా పెట్టాలి.వంటగదిని ప్రతిరోజూ క్లీన్ చేయాలి. వారానికి ఒకసారి వస్తువులన్నీ తీసి, వాటిని శుభ్రం చేసిన తర్వాత సర్దాలి.

# మొటిమంత బెంగ

**ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు.**



**ఇది మొటిమల అవగాహన మాసం**
ముఖం మీద చిన్న మొటిమ కనిపిస్తే చాలు. గిల్లేంతవరకూ కొందరికి చేయి ఆగదు. గట్టిగా నలిపి పిండేసేంత వరకూ నిద్ర పట్టదు. నిజానికి మొటిమలు ఆరోగ్యానికేమీ హాని చేయవు. చాలావరకివి వాటంతటవే తగ్గుతాయి. మరీ ఎక్కువగా, పెద్దగా అయితే చూడటానికి కాస్త ఇబ్బంది కలిగిస్తాయంతే. కానీ కొందరు.. ముఖ్యంగా యుక్తవయసువారు చిన్న మొటిమ కనిపించినా పెద్ద సమస్యగా భావిస్తారు. తెగ ఆందోళన పడిపోతుంటారు. మనో వేదనకూ గురవుతుంటారు. మొటిమల మీద లెక్కలేనన్ని అపోహలూ రాజ్యమేలుతుండటం, సరైన అవగాహన లేకపోవటమే దీనికి కారణం.
అప్పటివరకూ నునుపుగా ఉన్న ముఖం మీద ఏంటీ మొటిమలు? ఒకట్రెండు కాస్తా చూస్తుండగానే సంఖ్య పెరుగుతూ వస్తోందేంటి? అందానికి, ఆకర్షణకు అత్యంత ప్రాధాన్యమిచ్చే యుక్తవయసువారిలో ఇలాంటి ఆలోచనలే ముసురుకుంటుంటాయి. ఇంతకీ ఇవి ఎలా పుట్టుకొస్తాయి? ఆశ్చర్యంగా అనిపించినా చర్మం నిగనిగలాడుతూ కనిపించటానికి తోడ్పడే చమురు గ్రంథులే మొటిమలకు కారణం! శరీరం మీద చర్మం అంతటా సన్నటి వెంట్రుకలు, వాటి కుదుళ్లుంటాయి. ప్రతి కుదురులో వెంట్రుక మొదలు (ఫాలికల్), చమురు గ్రంథులు (సెబేషియస్ గ్లాండ్స్) ఉంటాయి. గ్రంథుల నుంచి ఉత్పత్తయ్యే చమురు సన్నటి రంధ్రాల ద్వారా బయటకు వస్తుంది. ముఖం, ఛాతీ, వీపు, భుజాలు, చేతుల మీద ఈ గ్రంథులు పెద్ద సంఖ్యలో ఉంటాయి. ఇవి వాచి, ఉబ్బి.. గుల్లల మాదిరిగా పైకి పొడుచుకు రావటమే మొటిమలకు మూలం. కొందరిలో జన్యుపరంగా టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు గ్రంథులను ప్రేరేపితం చేయటం వల్ల మరింతగా చమురు ఉత్పత్తి అవుతుంది. మరోవైపు చర్మ రంధ్రాల్లో ప్రొపిని బ్యాక్టీరియం ఆక్నిస్ అనే బ్యాక్టీరియా చమురును కొవ్వు ఆమ్లాలుగా విడగొడుతుంటుంది. ఈ ఆమ్లాలు వెంట్రుక కుదురును ప్రేరేపించే క్రమంలో కెరటిన్ పదార్థం ఎక్కువగా ఉత్పత్తి అయ్యి, చర్మ రంధ్రాలు మూసుకుపోవచ్చు. దీంతో అక్కడ ఉబ్బుగా, గుల్ల మాదిరిగా ఏర్పడి.. మొటిమ తలెత్తుతుంది. ఇది క్రమంగా పెద్దగా అవుతూ రావొచ్చు. కొన్నిసార్లు చర్మ రంధ్ర మార్గం పగిలి, వాపు మొదలవ్వచ్చు. ఫలితంగా అక్కడ ఎర్రబడి, మొటిమ పొక్కులా పొడుచుకొస్తుంది. లోపల చీము చేరటం, చితకటం, గుంతలు పడటం.. అన్నీ దీని పర్యవసానాలే.

**నాలుగు రకాలు**
సాధారణంగా మనం మొటిమలన్నింటినీ ఒకే గాటన కట్టేస్తుంటాం. కానీ తెలుపు లేదా నలుపు గుల్లలు (బ్లాక్‌హెడ్స్, వైట్‌హెడ్స్), చీము గుల్లలు (పశ్చులే), తిత్తులు (సిస్ట్స్).. ఇలా మొటిమలు రకరకాలుగా ఉంటాయి. తీవ్రతను బట్టి వీటిని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు.
**గ్రేడ్ 1:** చాలా సన్నగా, చిన్నగా ఉండేవి (కొమెడోన్స్). వైట్‌హెడ్స్, బ్లాక్‌హెడ్స్ ఇలాంటివే.
**గ్రేడ్ 2:** బ్లాక్‌హెడ్స్ ఇన్‌ఫెక్షన్‌కు గురై, చీము పట్టడం (పశ్చు లర్).
**గ్రేడ్ 3:** గుల్లలు ఇన్‌ఫెక్షన్‌తో వాచి, గడ్డ మాదిరిగా అవటం (నాడ్యులర్).
**గ్రేడ్ 4:** గడ్డ మరీ పెద్దగా, లావుగా ఉబ్బటం (నాడ్యులోసిస్టిక్).
ఆడవారిలో ఎక్కువ
మగవారిలో కన్నా ఆడవారికి మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశముంది. ఎందుకంటే వీరిలో హార్మోన్ల వ్యత్యాసాలు ఎక్కువ. ఆడవారిలో అండాశయాల్లో నీటి తిత్తులు (పీసీఓఎడీ), నెలసరి సరిగా రాకపోవటం, థైరాయిడ్ పనితీరు దెబ్బతినటం, టెస్టోస్టిరాన్ హార్మోన్ మోతాదులు అస్తవ్యస్తం కావటం వంటివీ మొటిమలు ఎక్కువగా వచ్చేలా చేయొచ్చు.
ఏ వయసులోనైనా..
మొటిమలు యుక్తవయసులోనే వస్తుంటాయని, ఆ తర్వాత వాటంతటవే పోతాయని చాలామంది భావిస్తుంటారు. నిజానికి వీటికి ఒక వయసంటూ లేదు. శిశువుల దగ్గరి నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా రావొచ్చు. కానీ సగటున 10–25 ఏళ్ల వయసులో ఎక్కువగా చూస్తుంటాం. అలాగని అక్కడితోనే ఆగిపోతాయని కచ్చితంగా చెప్పలేం. కొందరికి 20ల్లో, 30ల్లో, 40ల్లోనూ రావొచ్చు. కొందరు మహిళలకు యుక్తవయసులో కొద్దిగానే మొటిమలు వచ్చినా పెద్దయ్యాక తీవ్రంగానూ వేధించొచ్చు.

**ముఖం మీదే కాదు..**
మొటిమలు చాలావరకూ.. 99% ముఖం మీదే వస్తుంటాయి. నుదురు, బుగ్గలు, ముక్కు మీద ఇవి కనిపిస్తుంటాయి. చమురు గ్రంథులు లేకపోవటం వల్ల పెదవులు, పెదవుల పైభాగంలో మాత్రం రావు. కొందరికి ముఖం మీదే కాదు.. ఛాతీ, వీపు, చేతుల మీద కూడా రావొచ్చు.

**గిల్లితే తగ్గవు**
మొటిమలను గిల్లి, నొక్కి పిండితే త్వరగా తగ్గుతాయని కొందరు అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. గిల్లితే మొటిమలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. శాశ్వతంగా మచ్చలు పడొచ్చు. ఇన్‌ఫెక్షన్ మరింత లోతుకు చొచ్చుకెళ్లి ముఖం మీద గుంతలు పడే ప్రమాదముంది. ఒకసారి గుంత పడితే పూర్తిగా మామూలు స్థాయికి తీసుకొచ్చే చికిత్సలేవీ లేవు. కాకపోతే గుంతల లోతును తగ్గించి, అంతగా కనిపించకుండా చేయొచ్చు.

**గట్టిగా రుద్ది కడిగితే పోవు**
ముఖాన్ని గట్టిగా, రుద్ది కడిగితే మొటిమలు పోతాయనుకోవటం అపోహ. దీంతో మొటిమలు తగ్గటం అటుంచి, మరింత ఎక్కువవుతాయి. ఇన్‌ఫెక్షన్ లోపలికి వెళ్లిపోయి, గుంతలు పడే అవకాశముంది. గట్టిగా రుద్దటం కన్నా రోజుకు రెండు సార్లు మృదువుగా తేలికైన, పరిమళం లేని క్లీన్సర్‌తో ముఖాన్ని కడుక్కోవటం మంచిది. వేలి చివర్లతో క్లీన్సర్‌ను ముఖానికి రాసుకోవాలి. అనంతరం గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి.
కొందరు చర్మం రంధ్రాలు విప్పారతాయనే భావనతో ఆవిరి స్నానాలు చేస్తుంటారు. కానీ వీటితో మొటిమలు మరింత ఎక్కువవుతాయి.

**ఆహారంతో పరోక్ష సంబంధం**
రాత్రిపూట జంక్‌ఫుడ్ తిన్నా.. ఎక్కువ కేలరీల ఆహారం తిన్నా మొటిమలు ఎక్కువగా పుట్టుకురావొచ్చు. ఎందుకంటే శరీరం వాడుకోకుండా మిగిలిన కేలరీలు ఒంట్లో కొవ్వుగా మారతాయి. వీటి నుంచి టెస్టోస్టిరాన్ వంటి లైంగిక హార్మోన్లు పుట్టుకొచ్చి మొటిమలను ప్రేరేపిస్తాయి. అందువల్ల సాయంత్రం ఆరు గంటల తర్వాత జంక్‌ఫుడ్, పెద్దమొత్తంలో పిండి పదార్థాలు.. పాల పదార్థాలు (పెరుగు మినహాయించి) తీసుకోవటం మానెయ్యాలి. స్వీట్లు, చాక్లెట్లు, కొవ్వు పదార్థాల వంటివి తగ్గించుకోవాలి.
ఆరోగ్యకరమైన ఆహారంతో మొటిమల తీవ్రతను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా విటమిన్ ఏతో కూడిన పాలు (పగటిపూట), క్యారెట్, క్యాబేజీ, చిలగడ దుంపలు.. ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు గల చేపలు, అక్రోట్లు.. జింక్‌తో కూడిన పదార్థాలు మొటిమలు ఉద్ధృతం కాకుండా కాపాడతాయి.

**పౌడర్ కారణం కాదు**
కొందరు ముఖానికి పౌడర్ రాసుకుంటే చర్మ రంధ్రాలు మూసుకుపోయి మొటిమలు వస్తాయని భావిస్తుంటారు. ఇది అపోహే. కాకపోతే గాఢమైన కెమికల్ పీల్స్‌తో చమురు గ్రంథులు ఇంకాస్త పెద్దగా అవ్వచ్చు. ఫలితంగా మొటిమలు ఉద్ధృతమవుతాయి. కొన్ని స్టెరాయిడ్ క్రీములతోనూ ఇవి ఎక్కువ కావొచ్చు. కాబట్టి కెమికల్ పీల్స్ వాడకపోవటం మంచిది. సన్‌స్క్రీన్, మాయిశ్చరైజర్లయినా సరే.. నాన్ కొమెడోజెనిక్ రకానికి చెందినవే ఉపయోగించాలి.

**ఒత్తిడికి దూరంగా**
మానసిక ఒత్తిడి, ఆందోళనలు మొటిమలకు కారణం కాకపోయినా అప్పటికే ఉన్నవి ఉద్ధృతమయ్యే అవకాశముంది. కాబట్టి మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలి. ధ్యానం, ప్రాణాయామం చేయాలి.

**చికిత్స అవసరమా?**
మొటిమలు ఆరోగ్యానికేమీ హాని కలిగించవు. కానీ వీటితో గుంతలు పడితే జీవితాంతం అలాగే ఉంటాయి. కాబట్టి చికిత్స తీసుకోవటం మంచిది. కొత్తగా మొటిమలు వస్తున్నా పెద్దగా ఆందోళన అవసరం లేదు. కానీ ఉన్నవి తగ్గకపోతుంటే మాత్రం చికిత్స అవసరం. అలాగే చీము పట్టటం, గడ్డలు ఏర్పడటం, ముఖమంతా నల్లటి మచ్చల్లా మారుతున్నా తాత్సారం చేయరాదు. చికిత్స ఉద్దేశం– మొటిమలు ఉద్ధృతం కాకుండా చూడటం.. తీవ్ర స్థాయి నుంచి స్వల్ప స్థాయికి తీసుకురావటం. సాధారణంగా ఒక వయసు వచ్చేసరికి మొటిమలు నియంత్రణలోకి వస్తాయి. అప్పటివరకూ డాక్టర్ పర్యవేక్షణలో చికిత్స తీసుకుంటే గుంతలు, మచ్చలు పడకుండా చూసుకోవచ్చు.

**ఏంటీ చికిత్స**
మామూలు వైట్, బ్లాక్‌హెడ్స్‌కు రెటినాల్ క్రీములు మేలు. ఇవి గడ్డకట్టిన కెరటిన్ విడిపోయేలా, చర్మ రంధ్రాలు తెరచుకునేలా చేస్తాయి.
చీము పడితే డాక్సీసైక్లిన్, అజిత్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్ ఇవ్వాల్సి ఉంటుంది.
మరీ తీవ్ర మొటిమలకు రెటినాయిడ్, విటమిన్ ఏ మాత్రలు ఉపయోగపడతాయి. ఇవి చమురు ఉత్పత్తిని తగ్గించి, రంధ్రాలు తిరిగి తెరచుకునేలా చేస్తాయి. అయితే వీటిని 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయసువారికే ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు డాక్టర్ సలహా తీసుకోకుండా తమకు తామే విటమిన్ ఏ మాత్రలను వేసుకోవటం ఎక్కువైంది. ఇది ప్రమాదకరం. యుక్తవయసులో ఇవి ఎదుగుదలను, చూపును దెబ్బతీయొచ్చు. సంతానం కోసం ప్రయత్నిస్తున్నవారు, గర్భిణులు, బాలింతలు వీటిని వాడటం మంచిది కాదు. కాబట్టి రక్త పరీక్ష చేయించుకొని, డాక్టర్ పర్యవేక్షణలోనే ఒక వయసు వచ్చేవరకూ వాడి, మానెయ్యాలి.
రెటినాల్ క్రీములు పడనివారికి శాల్సిలిక్ యాసిడ్ పీల్స్ మేలు చేస్తాయి.
మందులతో ఫలితం కనిపించవారికి, మందులు వాడటం కుదరనివారికి లేజర్ చికిత్సతో ఫలితం కనిపిస్తుంది. చికిత్సలతో రాత్రికి రాత్రే మొటిమలు తగ్గుతాయని అనుకోవద్దు. ఇవి పని చేయటానికి 4–8 వారాలు పడుతుంది.

**మచ్చలు, గుంతలు పడితే?**
మొటిమలతో మచ్చలు, గుంతలు పడితే చర్మం రకం, వయసు, జీవనశైలి, మచ్చల రకాన్ని బట్టి డెర్మారోలర్, కెమికల్ పీల్, మైక్రోనీడ్లింగ్ రేడియో ఫ్రీక్వెన్సీ, ఫ్రాక్షనల్ సీవో2 లేజర్, ఎర్బియం యాగ్ లేజర్.. వీటిల్లో ఏదో ఒకదాంతో చికిత్స చేయొచ్చు. లేజర్లు చర్మం కిందుండే కొలాజెన్‌ను దెబ్బతీస్తాయి. తర్వాత అక్కడ కొత్త కొలాజెన్ ఏర్పడుతుంది. ఈ క్రమంలో మచ్చలు, గుంతలు తగ్గుతాయి. అయితే గుంతలు పూర్తిగా పోవని గుర్తించాలి. 60–70% మాత్రమే పూడతాయి. గుంతలు ముఖానికి ఇబ్బంది కలిగించటం లేదని అనుకునేంతవరకూ చికిత్స తీసుకోవచ్చు.

# కౌంటీ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్ మాయ.. ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లతో గంభీర్‌కు గట్టి సందేశం

- ఇంగ్లండ్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కుల్దీప్
- యార్క్‌షైర్ తరఫున ఆడుతూ ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన వైనం
- బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచిన స్పిన్నర్
- ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, కోచ్ గంభీర్‌కు గట్టి సందేశం
- భారత, ఇంగ్లండ్ పిచ్‌ల మధ్య ఉన్న తేడాను వివరించిన కుల్దీప్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. యార్క్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ చైనామన్ బౌలర్, ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ రాణించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. నిలకడగా అవకాశాలు దక్కని ప్రస్తుత తరుణంలో ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు గట్టి సందేశం పంపినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఒకే మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శన**

ఎసెక్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో యార్క్‌షైర్ తరఫున బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్ ఆద్యంతం ఆధిపత్యం చెలాయించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి 50 పరుగులకే 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 120 పరుగులకు 10 వికెట్లు సాధించిన ఘనతను అందుకున్నాడు. అంతకుముందు బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టు స్కోరు 390కి చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఎసెక్స్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ అయింది.

**ఇంగ్లండ్, భారత పిచ్‌ల మధ్య తేడా ఇదే..**

మ్యాచ్ అనంతరం కుల్దీప్ మాట్లాడుతూ ఇంగ్లండ్ పిచ్‌ల స్వభావాన్ని వివరించాడు. “ఇక్కడి వికెట్లపై బౌలింగ్ చేయడం చాలా బాగుంది. పిచ్‌లోనే మంచి పేస్ ఉండటంతో మనం వేగంగా బంతులు వేయాల్సిన అవసరం లేదు. బంతి పిచ్ అయ్యాక వేగం పుంజుకుంటుంది. మనం చేయాల్సిందల్లా బంతిని బాగా స్పిన్ చేయడమే. భారత పిచ్‌లతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నం. మన దగ్గర వికెట్లు నెమ్మదిగా ఉంటాయి, స్పిన్ ఎక్కువ తిరుగుతుంది. కానీ బ్యాటర్లు సర్దుకోవడానికి సమయం దొరుకుతుంది. ఇక్కడ పిచ్ వేగం కారణంగా బ్యాటర్లు బ్యాక్‌ఫుట్‌పై ఆడితే దొరికిపోతారు. ఫ్రంట్‌ఫుట్‌పై ఆడాల్సి వస్తుంది. అప్పుడే కీపర్ క్యాచ్, స్లిప్ క్యాచ్ లేదా షార్ట్ లెగ్ క్యాచ్ రూపంలో వికెట్లు తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది” అని కుల్దీప్ విశ్లేషించాడు.

**గంభీర్‌కు సందేశమా?**

లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్లు (చైనామన్) ప్రపంచ క్రికెట్‌లో చాలా అరుదు. అలాంటి అరుదైన నైపుణ్యం ఉన్నప్పటికీ, 2017లో అరంగేట్రం చేసినప్పటి నుంచి కుల్దీప్ కేవలం 19 టెస్టుల్లో మాత్రమే ఆడాడు. కెరీర్ ఆరంభంలో అశ్విన్, జడేజా ద్వయం కారణంగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు హెడ్ కోచ్‌గా వచ్చిన గౌతమ్ గంభీర్, కాస్త బ్యాటింగ్ చేయగల బౌలర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.
ఈ కారణంగానే వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లకు అవకాశాలు లభిస్తుండగా, కుల్దీప్ జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. నిలకడగా అవకాశాలు లేక తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో కౌంటీల్లో 10 వికెట్ల ప్రదర్శనతో తన ప్రధాన బలం బౌలింగే అని, అవకాశాలిస్తే ఎలాంటి పిచ్‌పైనైనా వికెట్లు తీయగలనని కుల్దీప్ యాదవ్ సెలక్టర్లకు, యాజమాన్యానికి స్పష్టమైన సంకేతాలు పంపాడు.

# చెన్నై సూపర్ కింగ్స్ లో వాటా కావాలని ధోనీ అడగలే.. కానీ కోట్లు విలువ చేసే షేర్లు ఉన్నాయ్: అసలు

**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ఎంఎస్ ధోనికి రూపాయి వాటా కూడా లేదంటూ సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ చేసిన వ్యాఖ్యలు అబద్ధమని తేలిపోయింది. రూ.2,033 కోట్ల విలువైన ఈ ఐపీఎల్ ఫ్రాంచైజీలో ధోనికి ఏకంగా కోట్ల విలువైన షేర్లు ఉన్నట్లు వచ్చిన తాజా నివేదిక క్రికెట్ ప్రపంచంలో పెను సంచలనం సృష్టిస్తోంది.




**సీఎస్కేలో ధోని వాటా ఎంతంటే:**

క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీకి మూలస్తంభంగా ఉన్న మహేంద్ర సింగ్ ధోని సీఎస్కేలో దాదాపు 1 లక్ష షేర్లు కలిగి ఉన్నారు. వీటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.2.6 కోట్ల నుంచి రూ.3 కోట్లుగా ఉంది. కానీ ఫ్రాంచైజీ యాజమాన్యం నుంచి నేరుగా కాకుండా, అన్‌లిస్టెడ్ కంపెనీ అయిన సీఎస్కే షేర్లను ప్రైవేట్ ఆఫ్-మార్కెట్ లావాదేవీల (ాటట-మీుతీఎవ ెతీుఅయిఛ్షుశీఅం) ద్వారా మహీ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

**సీఈఓ ఖండించినా బిగ్ ట్విస్ట్:**

ఎంఎస్ ధోని తమను వాటాల కోసం ఎప్పుడూ సంప్రదించలేదని, శ్రీనివాసన్‌తో కూడా దీనిపై చర్చించలేదని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ గతంలో క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం సీఎస్కే ప్రమోటర్ అయిన శ్రీనివాసన్ కుటుంబం దగ్గర 55 శాతానికి పైగా మెజారిటీ వాటా ఉండగా.. సాధారణ ప్రజల వద్ద ఉన్న 40 శాతం వాటా (30 కోట్ల షేర్లు) నుంచే ధోని తెలివిగా 1 లక్ష షేర్లను తన సొంతం చేసుకున్నారు.

**రూ.1200 కోట్ల బిజినెస్ సామ్రాజ్యం:**

దాదాపు రూ.1,200 కోట్ల నికర ఆస్తి కలిగిన మహేంద్ర సింగ్ ధోని కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా పలు రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. చెన్నైయిన్ ఎఫ్‌సీ ఫుట్‌బాల్ టీమ్‌తో పాటు గరుడ ఏరోస్పేస్, కార్స్24, హోమ్‌లేన్, ఈమోటోరాడ్ లాంటి 15కి పైగా దిగ్గజ స్టార్టప్‌లలో ధోని వాటాలని కలిగి ఉన్నాడు. ఇప్పుడు సీఎస్కేలోనూ ఓనర్‌షిప్ వాటా బయటపడటంతో తలా ఈజ్ ది రియల్ బాస్ అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియాను ఊపేస్తున్నారు.

# టీమ్‌మేట్స్‌పై కాఫీ చల్లోద్దు బాస్.. కేఎల్ రాహుల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ స్ట్రిక్ట్ వార్నింగ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2027 ట్రేడింగ్ విండో వేళ కేఎల్ రాహుల్ పేరు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ నుంచి రాహుల్ బయటకు వెళ్ళిపోతున్నాడని, కేకేఆర్ (ఖఖ=) జట్టు అతన్ని కొనుగోలు చేయడానికి సిద్ధమైందంటూ జోరుగా ప్రచారం జరుగుతుండగా.. ఢిల్లీ టీమ్ అఫీషియల్ ఇన్స్టాగ్రామ్ పేజీ చేసిన ఒక సంచలన కామెంట్ ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది.

**కోచ్‌పై కాఫీ విసిరి కొట్టాడా:**

ఐపీఎల్ 2026 సీజన్ సమయంలో ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ హేమాంగ్ బదానీకి, కేఎల్ రాహుల్‌కు మధ్య తీవ్ర స్థాయిలో వివాదం నడిచిందని.. కోపంలో రాహుల్ ఏకంగా కోచ్‌పై కాఫీ విసిరి కొట్టాడంటూ నెట్టింట వార్తలు వైరల్ అయ్యాయి. తాజాగా రాహుల్ ప్రశాంతంగా కాఫీ తాగుతున్న ఫోటోను ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేయగా, డీసీ అఫీషియల్ హ్యాండిల్ స్పందిస్తూ.. ఎవరిపైనా కాఫీ చల్లకండి బాస్! (ఖఱంఱ జూవ జూష్ట్రవఎఱు ఎఫ్) అంటూ కౌంటర్ ఇచ్చింది. ఈ కామెంట్‌తో వివాదం నిజమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**కేకేఆర్‌కు ట్రేడ్ సస్పెన్స్‌పై క్లారిటీ:**

కాఫీ వివాదం కారణంగా కేఎల్ రాహుల్‌ను కేకేఆర్‌కు ఇచ్చేస్తున్నారనే వార్తలను ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ పూర్తిగా తోసిపుచ్చారు. రాహుల్ అత్యద్భుతమైన ఆటగాడని, రాబోయే కొన్ని ఐపీఎల్ సీజన్ల వరకు అతడే తమ ఫ్రాంచైజీ కీలక ప్లేయర్‌గా కొనసాగుతాడని స్పష్టం చేశారు. దీంతో రాహుల్ ట్రేడింగ్ ప్రచారానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.

**ఢిల్లీ తరఫున రాహుల్ రికార్డులు:**

2025 సీజన్: మిడిల్ ఆర్డర్‌లో దిగి 53.90 సగటుతో 539 పరుగులు.

2026 సీజన్: ఓపెనర్‌గా ప్రమోషన్ పొంది 174.41 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 600 పరుగులు.

ఓవరాల్ రికార్డు: 27 ఇన్నింగ్స్‌ల్లో 49.21 సగటుతో 1,132 రన్స్ (2 సెంచరీలు, 8 హాఫ్ సెంచరీలు).

అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న కేఎల్ రాహుల్ లాంటి టాప్ ఆర్డర్ బ్యాటర్ ని వదులుకోవడానికి ఢిల్లీ యాజమాన్యం సిద్ధంగా లేదు. వివాదాలను పక్కనబెట్టి రాబోయే సీజన్‌లోనూ రాహుల్‌నే తమ మెయిన్ వెపన్‌గా బరిలోకి దింపేందుకు సిద్ధమవుతోంది.

# ‘వారణాసి’ హైదరాబాద్ టూ అంటార్కిటికా జర్నీ!







ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా తెరకెక్కుతోన్న సంచలన చిత్రం ‘వారణాసి’. సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. కథా నేపథ్యం, విజువల్స్ పరంగా చిత్రం సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది. విభిన్నమైన సంస్కృతులు, భౌగోళిక వాతావరణాల కలబోతగా రూపొందుతున్న చిత్రం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక్కసారి ఈ సినిమా విశేషాల్లోకి వెళ్తే.. ఈ సినిమా చిత్రీకరణ ప్రయాణం భాగ్యనగరం హైదరాబాద్‌లోనే ఘనంగా ప్రారంభమైంది. అధునాతన సెట్లు, కీలక నటీనటులపై ప్రధాన సన్నివేశాల చిత్రీకరణను ఇక్కడే పూర్తి చేశారు. నిర్మాణ పరంగా అన్ని సౌకర్యాలు కలిగిన హైదరాబాద్ నుంచి మొదలైన సుదీర్ఘ ప్రయాణం, కథాగమనానికి అనుగుణంగా దేశవిదేశాల్లోని అనేక విభిన్న ప్రాంతాలకు విస్తరించడం విశేషం. హైదరాబాద్ షెడ్యూల్ అనంతరం చిత్ర బృందం ఒడిశాలోని ప్రకృతి రమణీయమైన చారిత్రక ప్రాంతాలకు చేరుకుంది. అక్కడ అందుబాటులో ఉన్న సహజసిద్ధమైన లొకేషన్లు, దట్టమైన అడవులు మరియు తీర ప్రాంతాల్లో కీలక ఘట్టాలను చిత్రీకరించారు. ఒడిశాలోని ప్రత్యేక వాతావరణం సినిమాకు కావాల్సిన రా అండ్ రియలిస్టిక్ లుక్‌ను అద్భుతంగా అందించింది. అక్కడి నుంచి ప్రాజెక్ట్ గ్లోబల్ లెవెల్‌కు రీచ్ అయింది. ఆఫ్రికా ఖండంలోకి ప్రవేశించింది. ఆఫ్రికాలోని విలక్షణమైన భూభాగాలు, ఎడారి ప్రాంతాలు , సహజ అడవుల నేపథ్యంలో శ్రమతో కూడుకున్న యాక్షన్ సన్నివేశాలను రూపొందించారు. హాలీవుడ్ చిత్రాలకు తగ్గకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఆఫ్రికాలో తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయనడంలో సందేహం లేదు.

అన్నింటికంటే ప్రసిద్ధమైన అత్యంత సాహసవంతమైన ఘట్టం అంటార్కిటికా షెడ్యూల్. అత్యంత ప్రతికూల వాతావరణం, సున్నా కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న అంటార్కిటికా మంచు ఖండంలో షూటింగ్ జరపడం అరుదైన మైలురాయి. రికార్డు స్థాయిలో అత్యంత కష్టతరమైన పరిస్థితులను తట్టుకుని అక్కడ సాధించిన చిత్రీకరణ, విజువల్ పరంగా భారతీయ ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేయనుంది. హైదరాబాద్ టూ అంటార్కిటికా వరకు సాగిన ప్రయాణం లో కొంత భాగం మాత్రమే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఏడాది చివరికల్లా మిగతా చిత్రీకరణ పూర్తి చేస్తామని జక్కన్న ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రదేశాల్లో.. ఇంకెన్ని దేశాల్లో షూటింగ్ జరుతుందన్నది ఆసక్తికరం. సినిమాకు సంబంధించి ఇంకా షూట్ చేయాల్సిన కీలకమైన సన్నివేశాలు చాలా ఉన్నాయి. వాటి కోసం సిటీలోనే ప్రత్యేకంగా సెట్లు నిర్మిస్తున్నారు. అవపసరం మేర ఔట్ డోర్...ఆ సన్నివేశాలు డిమాండ్ చేసే విదేశీ లొకేషన్లను షూటింగ్ నిర్వహించనున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965